నేడు దేవదాయ శాఖా మంత్రి ఆనం రాక



విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం నగరానికి రానున్నారు. ఉదయం విజయవాడ నుంచి విమానంలో బయలుదేరి విశాఖ చేరుకుంటారు. నగరంలో సంపత్ వినాయకుని దర్శించుకున్న అనంతరం విజయనగరం వెళ్లి సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యపై ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజుతో చర్చిస్తారు. ఆ తరువాత నగరానికి వచ్చి కనకమహాలక్ష్మి అమ్మవారిని, సింహాచలం వరాహ నరసింహ స్వామిని దర్శించుకుని రాత్రికి విమానంలో విజయవాడ వెళతారు.

లైక్స్ లేవాయె, కామెంట్స్ రావాయె..

సోషల్ మీడియా వినియోగిస్తున్న నేటి తరానికి ఇప్పుడు ఇదే పెద్ద సమస్య!

- సహచరుల ఖాతాలతో పోల్చి చూసుకుంటూ ఆందోళన
- గంటలు తరబడి సామాజిక మాధ్యమాల్లోనే గడుపుతున్న వైనం
- పరిధి దాటితే ప్రమాదమంటున్న వైద్యులు
- అసభ్యకర మెసేజీలతో యూట్యూబర్స్, రీల్స్ చేసే వారిలో ఒత్తిడి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు కుటుంబం, బంధువులు, స్నేహితుల గురించి గొప్పగా చెప్పుకునేవాళ్లు. కాలం మారింది. నేటి తరం కుటుంబం, బంధువుల కంటే సామాజిక మాధ్యమాల్లో వచ్చే లైకులు, కామెంట్లు చూసి గొప్పగా ఫీల్ అవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో తాము పెట్టే పోస్టుకు లైక్స్, కామెంట్స్ ఎన్ని ఎక్కువ వస్తే...తాము అంత గొప్ప అన్న భావనలో ఉంటున్నారు. పొరపాటున పోస్టులకు ఆశించిన స్థాయిలో రీచ్ రాకపోతే ఒత్తిడికి గురవుతున్నారు. ఇటువంటి సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య రానురాను పెరుగుతోందని మానసిక వైద్యులు చెబుతున్నారు.

ముఖ్యంగా 25 ఏళ్లలోపు యువతలో ఈ సమస్య అధికంగా ఉంటోందంటున్నారు. ఈ మధ్య ఆదాయం కోసం యూట్యూబ్ చానెల్స్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు స్టార్ట్ చేసిన వారు కూడా వయసుతో సంబంధం లేకుండా ఇటువంటి సమస్యతో బాధపడుతున్నారంటున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఫ్రెండ్స్ అవుతున్న ముక్కూ, మొహం తెలియనివారు పెట్టే కామెంట్ల కోసం ఆర్రులు చాస్తూ ఇబ్బందులను కొని తెచ్చుకుంటున్నారు.

పదే పదే చూడడమే పని..

ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, 'ఎక్స్' (ట్విట్టర్) వంటి సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కనీసం పదేళ్లు వచ్చే వరకూ కూడా ఆగడం లేదు. వీటిలో ఏదో ఒక ఖాతాను ఓపెన్ చేసి తమకు నచ్చిన ఫొటోలు, విషయాలను పోస్టు చేస్తున్నారు. అయితే, వీటిని వినియోగిస్తున్న ఎక్కువ మందిలో ఒక రకమైన ఉత్సుకత కనిపిస్తోందని చెబుతున్నారు. తాము పోస్ట్ పెట్టిన తరువాత ఎంతమంది దానికి రియాక్ట్ అయ్యారన్న విషయాన్ని తెలుసుకునేందుకు పదేపదే చెక్ చేసుకుంటున్నారు. లైక్‌లు, కామెంట్లు ఎన్ని వచ్చాయన్నది చూసుకుంటున్నారు. ఆశించిన స్థాయిలో స్పందన లభిస్తే ప్రశాంతంగా ఉంటున్నారు. లేనిపక్షంలో మాత్రం తీవ్రమైన టెన్షన్‌కు గురవుతున్నట్టు చెబుతున్నారు. ఇందులో అధికంగా ఇరవై ఏళ్లలోపువారు ఉంటున్నారు. గంటల తరబడి సోషల్ మీడియా ఖాతాలను వినియోగించే వారిలో ఈ సమస్య అధికంగా ఉంటున్నట్టు చెబుతున్నారు. ఇటువంటివారు పదే పదే ఫోన్ చూసుకుంటూ తీవ్రమైన టెన్షన్, ఒత్తిడికి గురవుతుంటారని, కొందరిలో ఆందోళన, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తుంటాయని చెబుతున్నారు. ఫ్రెండ్స్‌గా ఉన్నవారు స్పందించకపోతే వారితో బయట మాట్లాడడం కూడా మానేస్తుంటారని, తన పోస్టుకు స్పందించని వాళ్లతో తానెందుకు మాట్లాడాలన్న భావనలో చాలామంది ఉంటున్నారని చెబుతున్నారు.

పోలికతో సమస్య...

ఇటువంటి సమస్య ఎక్కువగా ఎదుటి వారితో పోల్చుకోవడం వల్ల వస్తుంది. తమ సర్కిల్‌లో ఉన్న ఒక వ్యక్తికి ఎక్కువ మంది

... మిగతా 6వ పేజీలో

28 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- పినగాడిలో మాత్రమే ఎన్నిక నిర్వహణ
- మొత్తం 174 మందికిగాను 162 మంది ఏకగ్రీవంగా, మరో ఆరుగురు పోలింగ్ ద్వారా ఎన్నిక
- ఆరుచోట్ల ఎన్నిక వాయిదా
- అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తి
- మొత్తం 'కూటమి' కైవసం



భీమిలి మండలం తాళ్లవలస పెద్దచెరువు సంఘానికి ఎన్నికైన సభ్యులకు పత్రాలు అందిస్తున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గల 29 సాగునీటి సంఘాల్లో 28 సంఘాలకు పాలకవర్గాలు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పెందుర్తి మండలం పినగాడి సంఘానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. సంఘానికి ఆరుగురు చొప్పున 174 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకుగాను 162 మంది ఏకగ్రీవంగా, మరో ఆరుగురు పోలింగ్ ద్వారా ఎన్నికయ్యారు. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కాపులుప్పాడ, గంభీరం నీటి సంఘాల పరిధిలో ముగ్గురేసి చొప్పున ఆరు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికపై ప్రతిష్టంభన నెలకొనడంతో వాయిదా వేశారు.

జిల్లాలో ఆనందపురం మండలంలో నాలుగు, భీమిలి మండలంలో ఐదు, పద్మనాభం మండలంలో ఏడు, పెందుర్తి మండలంలో 13 నీటి సంఘాలు ఉన్నాయి. శనివారం ఉదయం ప్రతి సంఘానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, ఇద్దరు అసిస్టెంట్లు, బందోబస్తు కోసం పోలీసులు

... మిగతా 6వ పేజీలో

జిల్లా స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్

కలెక్టరేట్‌లో సిద్ధమవుతున్న డీఆర్‌టీజీ భవనం

- పర్యవేక్షణ అంతా అక్కడి నుంచే...
- సీసీ కెమెరాలన్నీ అనుసంధానం
- 30 మంది కూర్చుని నిశితంగా పరిశీలించేలా ఏర్పాట్లు
- నేరాలు, ప్రమాదాలు వంటివి చోటుచేసుకుంటే ఆయా ప్రాంతాల వారికి సమాచారం అందించేలా వ్యవస్థ
- ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు?



కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న నూతన భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత ఉపయోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈ-గవర్నెన్స్ అమలు చేస్తోంది. కొత్తగా వాట్సాప్ ద్వారా పౌర సేవలు అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే సమయంలో ప్రతి జిల్లా కేంద్రంలో 'డిస్ట్రిక్ట్ రియల్ టైమ్ గవర్నెన్స్' (డీటీఆర్‌జీ) ఉండాలని ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఒక భవనం నిర్మిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వంతో పాటు ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను దీనికి అనుసంధానం చేస్తారు.

డీటీఆర్‌జీలో కనీసం 30 మంది కూర్చుని జిల్లావ్యాప్తంగా అనుసంధానం చేసిన సీసీ టీవీ కెమెరాల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తారు. ఏ ప్రాంతంలో ఏమి జరుగుతున్నదీ గమనిస్తారు. దీని ద్వారా నేరస్థుల సమాచారం తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సెంటర్‌లో పోలీసులతో పాటు ఇతర శాఖల వారినీ ఉంచుతారు. నేరస్థులు, అనుమానితుల ఫేసియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు), గుంపులుగా చేరుతున్న జనాలు, నో పార్కింగ్ ఏరియాలో ఉల్లంఘనలు, తప్పుడు మార్గాల్లో ప్రయాణం చేయడం, సిగ్నల్ జంపింగ్, పనికి రాని వస్తువులను రహదారుల పక్కన వదిలేయడం వంటివన్నీ నిశితంగా పరిశీలించి అక్కడి నుంచే ఆయా ప్రాంతాల వారికి సమాచారం అందిస్తారు. తక్షణ చర్యలు చేపట్టాల్సిన సందర్భాల్లో హెచ్చరికలు చేస్తారు. ఈ సెంటర్ల పనితీరు ఎలా ఉండాలనే దానిపై త్వరలోనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ)ను సూచిస్తారు. ఈ కేంద్రాలకు రాష్ట్ర హెడ్ క్వార్టర్ నుంచి కూడా సమాచారం వస్తుంది.

విశాఖ జిల్లాలో జీవీఎంసీ, పోలీస్ కమిషనరేట్‌లలో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఉన్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా జీవీఎంసీ నగరంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన స్మార్ట్ పోల్స్, సీసీ టీవీ కెమెరాల ద్వారా ఫీడింగ్ తీసుకుంటోంది. అయితే అది కొన్ని పరిమిత ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాల్సిన స్మార్ట్ పోల్స్ నామమాత్రంగా మిగిలిపోయాయి. వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. ఇక పోలీస్ విభాగం తరఫున ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాల్లో చాలావరకు పనిచేయడం

... మిగతా 6వ పేజీలో

కిస్...క్



అభిమానులకు ఫ్లైయింగ్ కిస్ ఇస్తున్న శ్రీలీల

సినీ నటి శ్రీలీల శనివారం నగరంలో సందడి చేసింది. నగరంలోని డాబాగార్డెన్స్‌లో 'ది చెన్నయ్ షాపింగ్‌మాల్' ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె అభిమానులను ఆప్యాయంగా పలకరించింది. శ్రీలీలను చూసేందుకు పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు.

పెరిగిన చలి

- శివారు ప్రాంతాల్లో మరింత అధికం
- ఎయిర్‌పోర్టులో 18 డిగ్రీలు నమోదు
- పొగమంచుతో విమానాల రాకపోకలు ఆలస్యం



విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రెండు రోజులుగా చలి పెరిగింది. మంచు కూడా ఎక్కువ కురుస్తోంది. నగరం కంటే శివారు ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. విశాఖ ఎయిర్‌పోర్టులో శుక్రవారం కనిష్ఠ ఉష్ణోగ్రత 20 డిగ్రీలు నమోదుకాగా, శనివారం 18 డిగ్రీలకు పడిపోయింది. శనివారం ఉదయం ఎయిర్‌పోర్టులో గాలిలో తేమ శాతం 100గా నమోదైంది. మంచు కారణంగా ఎయిర్‌పోర్టులో రన్‌వే విజిబిలిటీ 2000 మీటర్లకు పడిపోయింది. దీంతో బెంగళూరు-విశాఖ-బెంగళూరు, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్, చెన్నై-విశాఖ-చెన్నై ఇండిగో సర్వీస్‌లు, ఢిల్లీ-విశాఖ-పోర్ట్ బ్లెయిర్..ఎయిర్ ఇండియా సర్వీస్‌లు ఆలస్యంగా వచ్చాయి. ఆదివారం కూడా చలి కొనసాగుతుందని, కనిష్ఠ ఉష్ణోగ్రత 18 డిగ్రీలకు అటుఇటుగా నమోదవుతుం దని, పొగమంచు కురుస్తుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా మధ్య భారతం నుంచి చలిగాలులు ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వైపు వీస్తున్నాయి. ఇంకా ఆకాశం నిర్మలంగా ఉండడంతో పొడి వాతావరణం నెలకొంది. దీంతో చలి పెరిగి కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయని వాతావరణ నిపుణుడు తెలిపారు. సాధారణంగా కార్తీక మాసం అంటే నవంబరు రెండో వారం నుంచి చలి మొదలుకావాలి. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి తుఫాన్‌లుగా బలపడడం, ఈశాన్య రుతుపవనాలు బలంగా ఉండడం, వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరగడం వంటి కారణాలతో ఈ సీజన్‌లో దాదాపు నెల రోజులు ఆలస్యంగా చలి ప్రారంభమైంది. రెండు, మూడు రోజులు కొనసాగి మళ్లీ కాస్త తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు.

మెడికల్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు అవశ్యం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్ వేదికగా నిలిచిందని సీఈవో జితేంద్రశర్మ
- ముగిసిన వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం-2024 సదస్సు



సీఈవో జితేంద్రశర్మ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):


మెడికల్ టెక్నాలజీ పురోగతిలో కొత్త శకానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడ్‌టెక్ జోన్ వేదికగా నిలిచిందని సీఈవో జితేంద్రశర్మ అన్నారు. నగర పరిధిలో గల మెడ్‌టెక్ జోన్‌లో మూడు రోజుల పాటు జరిగిన వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం-2024 సదస్సు శనివారంతో ముగిసింది. ఈ

... మిగతా 6వ పేజీలో

గ్రావెల్ తవ్వకాలపై విజి'లెన్స్'

- గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్‌లో తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

పెందుర్తి మండలం గుర్రంపాలెం పారిశ్రామిక లేఅవుట్, దానికి ఆనుకుని ఉన్న కొండ నుంచి భారీగా గ్రావెల్ తవ్వినట్టు గనుల శాఖ విజిలెన్స్ నిర్ధారించింది. పారిశ్రామికవాడలో ఐదు ఎకరాల మేర ప్లాట్లు వేసిన ఏపీఐఐసీ...పారిశ్రామిక సంస్థలకు కేటాయించింది. అయితే కొన్ని ప్లాట్లలో పెద్ద పెద్ద గోతులు ఉండడంతో ఫిల్లింగ్ చేసుకోవాల్సి వచ్చింది. ఒక ప్లాట్ ఫిల్లింగ్‌కు అదే ప్లాట్‌లో గ్రావెల్/మట్టి తవ్వి తరలించుకున్నట్టయితే అనుమతి అవసరం లేదు. అదే పక్కనున్న ప్లాట్ లేదా సమీపంలో కొండ లేదా ఖాళీ ప్రదేశం నుంచి తవ్వి తరలించాలనుకుంటే గనుల శాఖ నుంచి తాత్కాలిక పర్మిట్లు తీసుకుని, క్యూబిక్ మీటరుకు రూ.90 వంతున చెల్లించాలి. అయితే లేఅవుట్‌లో కొందరు గనుల శాఖ అనుమతి తీసుకోకుండా లేఅవుట్‌లోనూ, పక్కనున్న కొండ నుంచి గ్రావెల్ తవ్వి తమ ప్లాట్లకు తరలించుకున్నారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఐదారు నెలల క్రితం వెలుగులోకి తెచ్చింది. అయినా ఏపీఐఐసీ అధికారులు పట్టించుకోలేదు. గనుల శాఖ అధికారులు

... మిగతా 6వ పేజీలో

ఉక్కు కార్మికులకు అందని జీతాలు

సెప్టెంబరు నెల జీతం 50 శాతం, అక్టోబరు నెల జీతం 35 శాతం పెండింగ్

- డిసెంబరు 15వ తేదీ వచ్చినా నవంబరు జీతం ఊసే లేదు
- డిప్యుటేషన్‌పై వచ్చిన వారికి మాత్రం సకల సౌకర్యాలు
- ఆ ముగ్గురికి అన్ని వసతులతో జీతాలు
- ఫైనాన్స్ ఓఎస్‌డీకి 5 స్టార్ హోటల్‌లో బస

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా, వివిధ సంస్థల నుంచి ఇక్కడికి డిప్యుటేషన్‌పై వచ్చిన ఉన్నతాధికారులకు మాత్రం సకల సౌకర్యాలు కల్పిస్తోంది.

ఫైనాన్స్ విభాగానికి ఎన్‌ఎండీసీ నుంచి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా వచ్చిన మహిళా అధికారిణి నగరంలోని ఐదు నక్షత్రాల హోటల్‌లో బస చేస్తూ, రోజూ ఇన్నోవా కారులో సిటీ నుంచి స్టీల్‌ప్లాంటుకు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఇలాంటివి నడిచేవి. నష్టాలు ఎక్కువైన తరువాత అనవసర ఖర్చులు వద్దని తీర్మానం చేశారు. ఉద్యోగులకు అన్ని రకాల అలవెన్సులు రద్దు చేశారు. స్టీల్‌ప్లాంటుకు ప్రత్యేకంగా గెస్ట్ హౌస్‌లు ఉన్నందున ఎవరైనా ఉన్నతాధికారులు వస్తే అక్కడే బస చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి విరుద్ధంగా ఓఎస్‌డీ కొద్దిరోజులు నోవాటెల్‌లో ఆ తరువాత పార్క్ హోటల్‌లో ఉంటున్నారు. వీటికి రోజుకు ఎలా లేదన్నా రూ.10 వేలు అద్దె చెల్లించాలి. ఇన్నోవా కారుకు మరో రూ.5 వేలు కట్టాలి. అంటే ఆ అధికారిణికి రోజువారీ ఖర్చే రూ.15 వేలు. దుబారా ఖర్చులు తగ్గించాలని నీతి వచనలు చెప్పిన ఉన్నతాధికారులు వీటిని ఎలా ఆమోదిస్తున్నారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నతాధికారులు అందించిన ముడి పదార్థాలతో ప్రతికూల పరిస్థితుల్లోను అత్యధిక ఉత్పత్తిని సాధిస్తున్న కార్మికులకు నెలవారీ జీతాలు ఇవ్వడానికి యాజమాన్యం మూడు చెరువుల నీళ్లు తాగిస్తోంది. గత కొద్దికాలంగా రెండు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా రోజుకు 14 వేల టన్నుల ఉత్పత్తి తీస్తున్నారు. ఇది 110 శాతం ఉత్పత్తి. సామర్థ్యానికి మించి

... మిగతా 6వ పేజీలో



18న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ప్లాంటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో ఈ నెల 18న ధర్నా చేపట్టనున్నట్టు పోరాట కమిటీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అడ్మిన్ కార్యాలయ భవనం ముందు ఈ ధర్నా చేపట్టనున్నట్టు వెల్లడించారు. ధర్నాలో ఉద్యోగుల కుటుంబ సభ్యులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.



కలిసిన గంటా, ముత్తంశెట్టి

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమునిపట్నం నియోజకవర్గం నుంచి ఇటీవల ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు నువ్వా?, నేనా? అన్నట్టు తలపడ్డారు. ఒకరు టీడీపీ తరఫున, మరొకరు వైసీపీ తరఫున పోటీ చేశారు. గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇద్దరి మధ్య చాలాకాలంగా అంత సఖ్యత లేదు. తాజాగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. కొన్నాళ్ల రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం వీరిద్దరూ హైదరాబాద్‌లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. అల్లు అర్జున్ పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఓ అభిమాని చనిపోవడంతో ఆయన్ను శుక్రవారం అరెస్టు చేశారు. శనివారం విడుదలైన అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి గంటా, ముత్తంశెట్టి వేర్వేరుగా వెళ్లారు. అక్కడ ఇద్దరూ కలిశారు. ముత్తంశెట్టి త్వరలో కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

అనంత పద్మనాభుని క్షేత్రంలో శరవేగంగా ఏర్పాట్లు

పద్మనాభం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనంత పద్మనాభుడి క్షేత్రంలో సోమవారం నుంచి ధనుర్మాసోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆ రోజు ఉదయం 7 గంటలకు నెల గంటతో శ్రీకారం చుడతారు. జనవరి 15 వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఆలయంలోని లక్ష్మీదేవిని గోదాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు స్వామివారికి మేలుకొలుపు, 4.30 కి నగర సంకీర్తన, 5 గంటలకు వేణుగోపాలస్వామి, గోదాదేవిలకు బేడాసేవ, 5.30 గం.లకు నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహిస్తారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 3.30 గం.లకు స్వామివారికి మేలుకొలుపు 4గం.లకు పంచామృతాభిషేకం, 5గం.లకు స్వామివారు, అమ్మవార్ల బేడాసేవ, 7గం.లకు స్వామివారి గ్రామోత్సవం, 8 గం.లకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. 13న భోగి గోదా, రంగనాథులను గోస్తనీ నదికి తీసుకువెళ్లి నీలాటోత్సవం నిర్వహించి అనంతరం, కుంతీమాధవ స్వామి ఆలయంలో గోదా, రంగనాథుల శాంతి కల్యాణం నిర్వహిస్తారు. 15న స్వామివారి గిరి ప్రదక్షిణతో ఉత్సవాలు ముగుస్తాయి.

బోయి వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు

భీమునిపట్నం,డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బోయివీధిలో టీడీపీ నాయకులు శనివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పార్టీ యువ నాయకుడు గంటా రవితేజ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నాయకులు నూకరాజు, జీవన్‌కుమార్, అప్పలనాయుడు, రమేశ్, నాగరాజు, సంజీవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో కలశ జ్యోతి ప్రదర్శన



భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడ సుత్తమ్మ తల్లి భవాని పీఠం వద్ద శనివారం రాత్రి వందలాది మంది భక్తులతో కలశ జ్యోతి ప్రదర్శన నిర్వహించారు. మండలం లోని పలు గ్రామాలకు చెందిన 600 మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిల్పారామంలో విద్యార్థుల సందడి

మధురవాడ,డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో వన భోజనాల సందడి నెలకొంది. రెండవ శనివారం విద్యా సంస్థలకు సెలవు కావడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు శిల్పారామానికి విహార యాత్రకు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు ఆట పాటలుతో సందడిగా గడిపారు.



పాంద్రంగిలో పాలకవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారి



శొంఠ్యాం నీటి సంఘం సభ్యులను అభినందిస్తున్న నాయకులు

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- నియోజకవర్గంలో 16 సంఘాలకు నిర్వహణ
- అన్నిచోట్లా దాదాపుగా ఏకగ్రీవం
- గొడవలు జరగకుండా పీఎస్‌ల వద్ద పోలీసుల బందోబస్తు



తాటితూరు సాగునీటి సంఘానికి ఎన్నికైన వారితో టీడీపీ నాయకులు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 16 సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. దాదాపు అన్నిచోట్లా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పద్మనాభంలో ఏడు, ఆనందపురంలో నాలుగు, భీమిలిలో అయిదు సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. భీమిలిలోని తాటితూరు, నగరపాలెం కురపల్లి కాలువ సంఘానికి పాయల మహేశ్ చైర్మన్‌గా కాళ్ల అప్పలరాజు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మరో నలుగురు సభ్యులు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సింగనబంద సర్పంచ్ గాడు నారాయణ సమక్షంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు. తాళ్లవలస పెద్ద చెరువు సాగునీటి సంఘానికి ఎరుసు సన్యాసిరెడ్డి చైర్మన్‌గా, మరుపల్లి శేఖర్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దాకమర్రి ఇల్లందేవి చెరువు సంఘానికి కరుభుక్త అప్పలనాయుడు చైర్మన్‌గా కాళ్ల పైడినాయుడు వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కురపల్లి దివాన్‌జీ కాలువ సంఘానికి ఆర్‌ఎస్‌వీ రవికుమార్ రాజు చైర్మన్‌గా బోయి అప్పలరమణ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాపులుప్పాడ ఓపెన్ చెరువు సంఘానికి గుడ్ల వెంకటరమణ, బోని సురేశ్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు.

పద్మనాభంలో ఏడు సంఘాలు ఏకగ్రీవం

పద్మనాభం : మండలంలోని ఏడు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు ఇతర పదవులను కూటమి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్నికల ప్రక్రియను విశాఖపట్నం డీఆర్‌ఓ బి. భవానీ శంకర్, తహసీల్దార్ కె. ఆనందరావు ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు. మద్ది రాజు వెంకటపతి చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా నల్లి వెంకట గోవర్ధన గిరి, వైస్ చైర్మన్‌గా కె. బైరాగి, డైరెక్టర్లుగా సురేశ్, అప్పలనారాయణ, అప్పలరాజు, బంగారునాయుడు ఎన్నికయ్యారు. పాంద్రంగి కాటమయ్య చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా వెన్ని అప్పలరాజు, వైస్ చైర్మన్‌గా వెన్ని శంకరరావు, డైరెక్టర్లుగా నరసింగరావు, బంగారునాయుడు, సరోజిని, వెంకట అప్పల సూర్యనారాయణ ఎన్నికయ్యారు. కోరాడ కృష్ణంరాజు చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా గెద్ద ఎర్నాయుడు, వైస్ చైర్మన్‌గా పాంద్రంగి రామకృష్ణ, డైరెక్టర్లుగా ఆదినారాయణ, రమణ, తౌడు, రాజారావు ఎన్నికయ్యారు.పెంట గుండం చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా కె. అప్పలనాయుడు, వైస్ చైర్మన్‌గా కె. రామలక్ష్మి డైరెక్టర్లుగా పైడిరాజు, శ్రీరామ్మూర్తి, సత్యనారాయణ, సూర్యనారాయణ ఎన్నిక కాగా పొట్నూరు నూకాంబికా చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా గులమజ్జి మామ్మ, వైస్ చైర్మన్‌గా బి. రవి, డైరెక్టర్లుగా తాతబాబు, బంగాప్పడు, తమ్మునాయుడు, చంద్రయ్య ఎన్నికయ్యారు. గంధవరం నరసింహరాజు చెరువు సాగునీటి సంఘానికి కె. అమ్మతల్లి చైర్మన్‌గా, టి. వెంకట గణేశ్ వైస్ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా నరసింహరాజు, రాము, వెంకటరమణ, బాపూజీ ఎన్నికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన కర్రివాని చెరువు సాగునీటి సంఘానికి చైర్మన్‌గా గుమ్మడి కాళి, వైస్ చైర్మన్‌గా టి. సత్యం డైరెక్టర్లుగా వెంకటరమణ, ప్రకాశ్, సోమినాయుడు, పైడినాయుడు ఎన్నికయ్యారు.

ఆనందపురంలో నాలుగు

ఆనందపురం : మండలంలోని నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గుడిలోవ ఛానల్, కుసులువడ పల్లి ట్యాంక్,శొంఠ్యాం పెద్ద ట్యాంక్ సంఘాల ఎన్నిక ఏకగ్రీవం కాగా గంభీరం రిజర్వాయర్‌కు చైర్మన్, వైస్ చైర్మన్, ఒక డైరెక్టర్ ఏకగ్రీవంగా కాగా మూడు డైరెక్టర్లకు ఏకాభిప్రాయం కుదరక ఎన్నిక నిర్వహించలేదు.గుడిలోవ ఛానల్ చైర్మన్‌గా కర్రోతు సత్యన్నారాయణ, వైస్ చైర్మన్‌గా ముదిలి చిన్నయ్య పాత్రుడు, డైరెక్టర్లుగా భూర్లె గణపతిరావు, కొలుసు శ్రీను, పెద్ద రామకృష్ణ, మీసాల రాము ఎన్నికయ్యారు.శొంఠ్యాం పెద్ద చెరువు సాగుటి సంఘానికి అధ్యక్షుడిగా కోరుకొండ వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా కోరుకొండ రమణ, డైరెక్టర్లుగా నీలి లక్ష్మి, పిల్లా నర్సిబాబు, కోరుకొండ అప్పారావు, కోరుకొండ సన్యాసమ్మ, కుసులువాడపల్లి చెరువు సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా రేగాని జగ్గునాయుడు, ఉపాధ్యక్షుడిగా వెన్ని సత్యారావు, డైరెక్టర్లుగా సారికి అప్పలనారాయణ, రేగాని జగ్గునాయడు, పడగల అప్పలనాయుడు, బం గారు శ్రీనివాస్, పడాల సంతోష్ ఎన్నికయ్యారు. అలాగే గంభీరం రిజర్వాయర్ ఛానల్‌కు చైర్మన్‌గా తెడ్లాపు వెంకట అప్పారావు, వైస్ చైర్మన్‌గా ఇ. రమణ, డైరెక్టర్‌గా ఎన్. లక్ష్మి ఎన్నికయ్యారు.



మద్యం దుకాణం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

మద్యం దుకాణం తరలించాలని ఆందోళన

కొమ్మాది, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నివాస ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణాన్ని వేరేచోటకు తరలించాలని డిమాండ్ చేస్తూ 5వ వార్డు పరిధిలోని స్వయం కృషినగర్, అయ్యప్పనగర్ వాసులు శనివారం ఆ దుకాణం ఎదుట ఆందోళన చేపట్టారు. ఐద్వా మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు మాట్లాడుతూ నివాస ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అధికారులు ఈ విషయమై తక్షణమే స్పం దించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు ఐద్వా నాయకులు బి. భారతి, కొండమ్మ, కె. మణి, కె. శారద, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేథరిన్ స్కూల్‌ను సందర్శించిన ఆస్ట్రేలియా బృందం



పాఠశాల ఉపాధ్యాయులతో ఆస్ట్రేలియా బృందం

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విక్టోరియా యూనివర్సిటీకి చెందిన 20 మంది అధ్యాపక బృందం మూలకుద్దు కేథరిన్ విద్యాలయంలో రెండు వారాల పాటు విద్యపై అధ్యయనం చేశారు. శనివారం వారు ఇక్కడి నుంచి వెనుతిరిగారు. ఉపాధ్యాయుల విద్యా బోధన, తరగతి గదుల నిర్వహణ, మానసిక పిల్లల గుర్తింపు, తదితర వాటి గురించి వారు అధ్యయనం చేసినట్టు పాఠశాల చైర్మన్ ఆలీవర్‌రాయి, డైరెక్టర్ ఇవాంజలిన్ రాయి తెలిపారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

సింహాచలం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అడివివరం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ తల్లి నూతన ఆలయంలో విగ్రహం, శిఖర కలశాల స్థాపనలో భాగంగా శనివారం వేద పండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యశర్మ సారథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పంచగవ్య ప్రాశనం, హోమం, వాస్తు పూజ, పర్యాగ్నికరణం (అగ్నిస్పర్శ) చేశారు. తరువాత గ్రామానికి చెందిన మహిళలు పవిత్ర జలాలను, క్షీరాలను అభిషేకం చేశారు. అలాగే ప్రధాన కలశాన్ని పూజారి వంశానికి చెందిన లండ వెంకటరమణ, లండ భాస్కర, తోట చంద్రరావు గ్రామస్తులతో కలిసి మేళతాళాల నడుమ రాజవీధి, రామాలయం, కుమ్మరివీధి, ఘాట్ రోడ్డు వరసిద్ధి వినాయక ఆలయం మీదుగా తొలిపావంచాకు తీసుకువచ్చి అక్కడి నుంచి పైడితల్లెమ్మ గుడి మీదుగా తిరిగి బంగారమ్మ ఆలయానికి చేర్చారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

భీమునిపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వైద్యులు శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 150 మందిని పరీక్షించి, 40 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, పాఠశాల హెచ్‌ఎం రమణ, శంకర్ ఫౌండేషన్ సమన్వయకర్త రాజు, సుభాషిణి, ఈశ్వరరావు, త్రినాథరావు పాల్గొన్నారు.

మెడికల్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు అవశ్యం

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా ఆయన వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ మెడికల్ టెక్నాలజీలో నిత్యం నూతన ఆవిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో దేశాల మధ్య పరస్పర సహకారం చాలా ముఖ్యమన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ డెలివరీలు, ఇన్నోవేషన్, స్కేలింగ్ వంటి రంగాలపై దృష్టిసారించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు పాల్గొన్న ఈ సదస్సులో 50 ఎంఓయూలు జరిగాయి. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు వ్యూహాలు ఆవిష్కరించారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి : డీఈఓ

పద్మనాభం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళికను ఉపాధ్యాయులు సమర్థంగా అమలు చేయాలని డీఈఓ ఎస్. ప్రేమ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన పద్మనాభంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విదార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సందేహాలు ఉన్న పాఠ్యాంశాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించి, సూచనలు చేశారు.

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి, శత శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల రికార్డులను పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

వైభవంగా అప్పన్న తిరువీధి



మాడవీధిలో స్వామివారి తిరువీధి ఉత్సవం

సింహాచలం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నృసింహస్వామి ఆవిర్భావ తిథి శుక్ల పక్ష చతుర్థశి పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శనివారం సాయంత్రం స్వామివారి తిరువీధి ఉత్సవం వైభవంగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులతో సర్వ స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో స్వామివారు ఊరేగారు. దారి పొడ వునా భక్తులు ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి స్వాగతించారు. తిరువీధి ఉత్సవం ముందు మహిళల కోలాటం అలరించింది,

లోక్ అదాలత్‌లో 510 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య

భీమునిపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సివిల్ కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 510 కేసులు పరిష్కారమయ్యాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో ఉన్న వివిధ కేసులకు సంబంధించి రాజీ కుదుర్చారు.1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ పార్వతీశం, మూడు మండలాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అప్పన్న స్వామి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన సింహగిరి

సింహాచలం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూడా ఎక్కువ మంది తరలిరావడంతో సింహగిరి కిటకిటలాడింది. వేకువజామునే కొండదిగువ పుష్కరిణిలో భక్తులు స్నానాలు చేసి సమీపంలోని భైరవస్వామిని దర్శించుకుని కాలినడకన సింహగిరికి చేరుకున్నారు. తలనీలాలు సమర్పించి గంగధారలో స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు కోలలు వెలిగించి గరిడీలుతో భజనలు చేశారు. భక్తుల రద్దీ కారణంగా అప్పన్న ఆలయానికి సుమారు రూ.37.63 లక్షలు ఆదాయం లభించింది. శ్రీఘ్ర దర్శనం రూ.100, అతి శ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ.21.09 లక్షలు, ప్రసాదాల విక్రయాలు ద్వారా రూ.12 లక్షలు, తలనీలాల టికెట్ల ద్వారా రూ.2.25 లక్షలు, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1.09 లక్షలు స్వామివారి ఖజానాకు సమకూరింది.

లైక్స్ లేవాయె..కామెంట్స్ రావాయె..

... 5వ పేజీ తరువాయి

ఫాలోవర్స్, ఫ్రెండ్స్ ఉన్నా, వారికి ఎక్కువ కామెంట్లు వస్తున్నా చూసి చాలా మంది తట్టుకోలేకపోతుంటారని చెబుతున్నారు. వారి స్థాయిలో తనకు రావడం లేదన్న బాధతో తెగ మథనపడుతుంటారని నిపుణులు చెబుతున్నారు. తినేందుకు ఇష్టపడరని, నిద్ర కూడా సరిగా పోరని పేర్కొంటున్నారు. ఇది విద్యార్థుల్లో అధికంగా కనిపిస్తోందని, వయసుతో సంబంధం లేకుండా మహిళల్లోనూ ఇటువంటి సమస్య ఉన్నట్టు చెబుతున్నారు.

వేధింపులు

ఇక భిన్నమైన అంశాలపై వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారికి రకరకాల కామెంట్లు వస్తుంటాయి. కొన్ని అసభ్యకరంగా కూడా ఉంటాయి. ఇటువంటి కామెంట్లతో ఇబ్బంది పడుతున్నవాళ్లు ఉన్నారు. కొందరు వేధింపులకు గురిచేస్తుండడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై నిపుణులను సంప్రతిస్తున్న వారి సంఖ్య పెరిగింది. వీరిలో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. యూట్యూబ్ వీడియోలు, రీల్స్ చేసే వారికి ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

పోల్చి చూసుకోవడం వల్లే ఇబ్బందులు

- డాక్టర్ ఎస్ఎస్ నిహల్, మానసిక వైద్య నిపుణులు

సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టులకు వచ్చే రియాక్షన్స్ చూసుకుంటూ చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఇది చాలా చిన్న విషయం అని గుర్తించడం లేదు. ఇదంతా ఇతరులతో పోల్చుకోవడం వల్ల వస్తున్న ఇబ్బంది. ఒకసారి పోస్టు పెట్టిన తరువాత గంటల తరబడి వాటికి వచ్చిన రియాక్షన్స్ లెక్కించుకుంటూ కూర్చుంటున్నారు. గంటల తరబడి సామాజిక మాధ్యమాలకు సమయాన్ని వెచ్చించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్న మవుతాయి. దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కొన్నిసార్లు స్నేహితుల మధ్య గొడవకు కూడా ఇది కారణం అవుతోంది. పిల్లాడు దిగులుగా ఉంటున్నాడని, ఎవరితో మాట్లాడడం లేదని కొందరు తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం ఏమిటని ఆరా తీస్తే ఈ విషయాలను చెబుతున్నారు.

ఉక్కు కార్మికులకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్నా కార్మికులు, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెల జీతం 50 శాతం, అక్టోబరు నెల జీతం 35 శాతం పెండింగ్ పెట్టారు. నవంబరు నెల జీతం డిసెంబరు మొదటి వారంలోనే ఇవ్వాలి. కానీ సగం నెల గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. స్టీల్‌ప్లాంటుకు ఎంఓఐఎస్ నుంచి డిప్యుటేషన్‌పై సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఇలాంటి దుర్భరమైన పరిస్థితి వచ్చిందని ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. ఇక్కడి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సీఎండీ తాను మాత్రం ఎంఓఐఎల్ నుంచి ఒకటో తేదీనే జీతం అందుకుంటున్నారు. అలాగే ఓఎస్‌డీ ఇక్కడ అన్ని వసతులు పొందుతూ, అటు ఎన్ఎండీసీ నుంచి జీతం తీసుకుంటున్నారు. కానీ రెక్కలు ముక్కలు చేసుకుని అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద పని చేస్తున్న కార్మికులు మాత్రం జీతాలు సరిగా అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. 15వ తేదీ వరకూ జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. ఈ సమస్యను కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి దృష్టికి విశాఖ ఎంపీ శ్రీభరత్ తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. జీతాలు ఇవ్వడానికే ఏడిపిస్తున్న కేంద్ర పెద్దలు ప్లాంటును నష్టాల నుంచి గట్టెక్కిస్తామంటే ఎలా నమ్మాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

జిల్లా స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్

... 5వ పేజీ తరువాయి

లేదు. గత ప్రభుత్వం వాటి నిర్వహణ పట్టించుకోలేదని, తాము అన్నింటినీ అందుబాటులోకి తెస్తామని హోం శాఖా మంత్రి అనిత ఇటీవల ప్రకటించారు. వాటి నుంచి అందే సమాచారాన్ని పోలీసులు వారి కేసుల దర్యాప్తునకు ఉపయోగించుకుంటారు. ఇప్పుడు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటయ్యే కేంద్రం ద్వారా సమగ్ర పరిశీలన చేస్తూ నేరాలు జరగకుండా, జరిగినప్పుడు వెంటనే అప్రమత్తం చేసేలా చర్యలు చేపడతారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం మేరకు ఇది ఏప్రిల్ నుంచి పనిచేయాల్సి ఉంది. కలెక్టరేట్‌లో ఈ భవన నిర్మాణం ఇప్పటికే 70 శాతం పూర్తయింది.

28 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

... 5వ పేజీ తరువాయి

వెళ్లారు. పినగాడి సంఘానికి తప్ప మిగిలిన వాటిలో దాదాపు అన్నిచోట్ల ఏకగ్రీవాలకు ఓటర్లు మొగ్గుచూపారు. పినగాడిలో కూటమి పార్టీలోనే రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఎన్నిక నిర్వహించారు. ఇంకా కాపులుప్పాడ, గంభీరం సంఘాల్లో మూడేసి ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికలు జరగలేదు. మొత్తం 174లో 162 ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యులపై ఏకాభిప్రాయం కుదిరింది. ఆ తరువాత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వారంతా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. పినగాడిలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం సభ్యులు తమలో ఒకరిని అధ్యక్షునిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయించుకోవడంతో జిల్లాలోని 29 సంఘాలనూ కూటమి పార్టీల సానుభూతిపరులే చేజిక్కించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ పద్మనాభం మండలంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 29 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తయినట్టు జల వనరుల శాఖ డీఈ, ఎన్నికల నోడల్ అధికారి జె.స్వామినాయుడు తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలపై విజి‘లెన్స్’

... 5వ పేజీ తరువాయి

రెండు, మూడు పర్యాయాలు తనిఖీ చేసి ఏపీఐఐసీకి లేఖలు రాసినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ గనుల శాఖ విజిలెన్స్ అధికారులు రెండు నెలల క్రితం ఒకసారి తనిఖీ చేశారు. తాజాగా తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి కొలతలు వేశారు. ఆరు ప్లాట్లలో గ్రావెల్ ఫిల్లింగ్ చేసినట్టు గుర్తించారు. అయితే ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించారనేది లెక్కలు వేస్తున్నారు. త్వరలో పారిశ్రామిక సంస్థలు/వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు ప్రతిష్టాత్మక ఎన్ఏఏసీ (నాక్) ఏ గ్రేడ్ కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు.

ఇటీవల ఎన్ఏఏసీ బృందం కళాశాలలో అన్ని విభాగాలను తనిఖీ చేసి 3.17 జీపీఏతో ఏ గ్రేడ్ కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

☛ సంక్షిప్తంగా..

ధనుర్మాస ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

రేపు ఉదయం గం. 6 : 57కు నెలగంట



వెంకోజీపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :వేంకటేశ్వరుడి ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయాల నిర్వాహకులు ఆలయాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దా రు. రంగులను కూడా వేయిస్తున్నారు.

ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామిఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావుతెలిపారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ ప్రతిరోజూ గోదాదేవికి పూజలు నిర్వహిస్తారు. 16న ఉదయం 6.57 నిమిషాలకు ధనుర్మాస వ్రతం (నెలగంట) ప్రారంభం అవుతుందని వారు తెలిపారు. వచ్చే నెల 13 వరకు ఈ ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. వచ్చే నెల 10న ముక్కోటి ఏకాదశి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, నిత్యం ఉండే ఉత్తర ద్వార దర్శనంతో పాటు గోదాఅమ్మవారి అభిషేకం, తోమాలసేవ వంటి నిర్వహించనున్నట్టు తెలిపారు. జనవరి 11న స్వామి వారికి కుడారై ఉత్సవం, 13న గోదాదేవి కల్యాణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హరికథ, డాక్టర్ శారదాసుబ్రహ్మణ్యంతో భక్తి కీర్తనల ఆలాపన, చైతన్య బ్రదర్స్‌తో అన్నమాచార్య గానామృతం, రఘునాథతో అన్నమాచార్య కీర్తన కచేరీ ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు కిషోర్ శర్మ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ జీవీఎంసీ కమిషనర్‌కు వినతి



జీవీఎంసీ కమిషనర్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కమిషనర్‌ను కలిసిన ఆమె తమ వార్డులో రామకృష్ణాపురం బ్యాలెన్స్ రోడ్లు, అల్లూరి సీతారామరాజు లే అవుట్ రోడ్లు, పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వెనుక భాగాన రిటర్నింగ్ వాల్, శ్రీకృష్ణాపురంలో గల శ్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణం, క్రిష్టియన్ కమ్యూనిటీ శ్మశాన వాటిక, కాంపౌండ్‌వాల్ నిర్మాణం, శివశంకర్ నగరలో రోడ్లు, కాలవల నిర్మాణం, సాయినగర్‌లో రోడ్డు కాలవల నిర్మాణం, భగత్ సింగ్‌నగర్‌లో కొండవాలు ప్రాంతంలో నీటి ఎద్దడి నివారణ, ప్రతీ రోజు అన్ని ప్రాంతాలకు తాగు నీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలు ఉన్నా యని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 24, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

ప్రమాదాల కూడలి.. పెదగదిలి

- ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- ఈ జంక్షన్ మీదుగా వెళ్లాలంటేనే వెనుకంజ వేస్తున్న వాహనదారులు



నిత్యం వాహనాల రద్దీతో ఉండే పెదగదిలి జంక్షన్

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యగా ఇబ్బందిగా తయారైంది. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. విశాలంగా ఉండే ఈ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు లేవు. దీంత వాహనాల రాకపోకలపై నియంత్రణ లేక ఏ వాహనం ఎటు పోతుందో తెలియని గందరగోళం పరిస్థితి నెలకొంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో తోటగరువు జంక్షన్ నుంచి నిత్యం వందలాది మంది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా స్కూళ్ల నుంచి వచ్చే విద్యార్థులు, వాహనాలు ఎక్కువగా ఉంటాయి. నగరం నుంచి హనుమంతవాక జంక్షన్ మీదుగా సింహాచలం వెళ్లే వాహనాలు.., సింహాచలం నుంచి నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వెహికల్స్ వస్తుంటాయి. విశాలమైన రోడ్డు కావడంతో వేగంగా వాహనాలు నడుపుతుంటారు. అయితే ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో ఎవరికి వారు వాహనాలు తొందరగా పోనివ్వాలనే ఉద్దేశంతో వెళుతుంటారు. దీనివల్ల ఈ జంక్షన్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ ప్రాంతంలో వాహనాల నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను లేదా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇది కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పెదగదిలి జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి చక్కని వేదికలు రెవెన్యూ సదస్సులు

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, వేదికపై కార్పొరేటర్ రామలక్ష్మి, తహసీల్దార్ కిరణ్ తదితరులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న స్థానికులు

ఆరిలోవ, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి వివాదాలు, తాత్సారం లేకుండా భూసమస్యలు పరిష్కారం అయ్యేందుకు రెవెన్యూ చక్కని వేదికలు అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ప్రతి ప్రజా సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. శనివారం జీవీఎంసీ 9, 10, 11 వార్డులకు సంబంధించి పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ యజమానుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుకు రశీదు ఇస్తారని, అనంతరం అధికారులు పరిశీలించి గరిష్ఠంగా 45 రోజుల్లో పరిష్కరిస్తారన్నారు. గత ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చూపలేదు సరికదా మరింత చిక్కుల్లో పడేసిందన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిద్దామన్నా స్థలం లభించని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం భూముల పరిరక్షణ, ఆక్రమిత స్థలాల స్వాధీనం వల్ల కొంత భూమి సేకరించే అవకాశం ఉంటుందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు 100 గజాలోలపు ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా పట్టాలు ఇచ్చామని, 100 గజాల దాటి ఇల్లు కట్టుకున్న వారికి అతి తక్కువ రేటుకు పట్టాలు ఇచ్చామన్నా చెప్పారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఇంతవరకూ మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

ఈ నెల 16న ఆరిలోవలోని హిందీ కళాశాల వద్ద 12, 13 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తహసీల్దారు పాల్ కిరణ్, జోనల్ కమిషనర్-2 ఫణిరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పలువురు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రమణీయం కూచిపూడి నృత్యం



కిశోర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న గండి బాబ్జీ, నిర్వాహకులు

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు రమణీయంగా సాగాయి. కళాకారిణుల చక్కని హావభావాలతో సాగిన నృత్యాలకు చప్పట్లు మారుమోగాయి. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ప్రోత్సాహంతో విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపరంపర-24 పేరుతో నిర్వహించిన ఈ నృత్యప్రదర్శనలు ఆద్యంతగా రక్తి కట్టించాయి. అంతర్జాతీయ ఒడిస్సీ కళాకారులు ఆర్యదత్త, కథక్ నృత్య కళకారుడు గర్మి ఆర్య నృత్యాలు మంత్రముగ్ధులను చేశాయి.

ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు, కూచిపూడి నృత్య కళాకారుడు మొసలి కంటి కిశోర్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ సీడ్స్ అండ్ అగ్రికల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ చేతుల మీదుగా నిర్వాహకులు కళారత్న వెంపటి రవిశంకర్ జీవిత సాఫల్య అవార్డు ప్రదానం చేసి సత్కరించారు.

ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ భారతదేశం కళలకు పుట్టినిల్లు అన్నారు. కళలను ప్రోత్సహించి మన సంస్కృతీసంప్రదాయాలు పరిరక్షించడమే కాకుండా కళాకారులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల నిర్వాహకులు ఎం.ఎస్. శ్రీనివాస్, శ్రీధర్ బిత్ర, విక్రమ్‌కుమార్, టేకుమల్ల శ్యామల, కన్నం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలలో పాల్గొన్న కళాకారిణులు

ఆర్గానిక్ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా సత్వ నేచురల్ స్టాల్



కొబ్బరాకులు, బంతిపూల అలంకరణలో ఆకట్టుకుంటున్న సత్వ నేచురల్స్ స్టాల్

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో సీతమ్మధార ప్రాంతంలోని సత్వ నేచురల్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులకు ఆకట్టుకుంటోంది.

ఈ స్టాల్‌ను కొబ్బరాకులతో పెళ్లిపందిరిలా ఏర్పాటు చేసి బంతిపూలతో అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్టాల్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్, పాత తరానికి చెందిన ఇత్తడి వస్తువులు, రాతి రోకళ్లు, రోల్లు, సన్నికాళ్లు, మట్టి వస్తువులు, చెక్కతో తయారు చేసిన వస్తువులు, ఇంటిల్లిపాదీ ఉపయోగించే అనేక రకాల ఉత్పత్తులను సత్వ నేచురల్స్ నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. అలాగే అంతరించిపోతున్న పిచ్చికలు, పావురాలను కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రైతులు వద్ద నుంచి వరికంకులు సేకరించి వినియోగదార్లకు పంపిణీ చేస్తున్నారు.

రవీంద్రనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్



రవీంద్రనగర్ జంక్షన్‌లో నిలిచిపోయిన వాహనాలు

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు ఆఖరి బస్టాప్ వద్ద రవీంద్రనగర్ జంక్షన్‌లో శనివారం ఉదయం ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. ఒక్కసారిగా వాహనాలు లెక్కకు మించి రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రవీంద్రనగర్‌లో రెవెన్యూ సదస్సు ఉండడం, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొనడంతో ఆ కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్థానిక నేతలు జనాన్ని తరలించారు. దీంతో పాటు సదస్సుకు వచ్చే వారితో ఈ ప్రాంతం సందడి నెలకొంది. అధికంగా వాహనాలు రావడంతో తప్పుకోవడానికి ఇబ్బంది ఎదురైంది. దీంతో ఎప్పుడూ సాధారణంగా ఉండే ఈ జంక్షన్‌లో తీవ్ర రద్దీ నెలకొంది. ఫలితంగా వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు.

పోలీస్ క్వార్టర్స్‌లో అపరిశుభ్రత

- నెలల తరబడి చెత్త తొలగించని పారిశుధ్య సిబ్బంది
- దుర్గంధం, దోమల బెడదతో స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన క్వార్టర్స్‌లో పడి ఉన్న చెత్త

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పరిధిలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. టెన్నిస్ కోర్టు, క్వార్టర్స్ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. ఇక్కడ రైతు బజార్ ఉన్నందున బజార్‌లో చెత్త కూడా టెన్నిస్‌కోర్టు ఆవరణలో పడేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది, కార్మికులుఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు.



టెన్నిస్ కోర్టు ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

దీంతో నెలల తరబడి ఇక్కడ చెత్త పేరుకుపోయి కుప్పలుగా మారిపోయాయి. ఈ చెత్తను తరలించాలని పలుమార్లు సచివాలయ శానిటేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త నిల్వ ఉండడంతో వర్షం పడినప్పుడు తడిసి కుళ్లిపోతోంది. దీంతో దుర్వాసన వెలువడుతోంది. ఇక్కడ టెన్నిస్ కోర్టు ఉండడంతో చాలా మంది క్రీడాకారులు వస్తుంటారు. అయితే దుర్గంధంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లైట్లు లేవు.. ఫౌంటెన్ పని చేయదు

- అంధకారంలో ఏఎస్ రాజా మైదానం జంక్షన్



దీపాలు వెలగకపోవడతో చిమ్మచీకటిలో ఉన్న ఏఎస్ రాజా మైదానం జంక్షన్

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. కొన్ని రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపతున్నారు. కానీ ఆశించిన ఫలితం మాత్రం శూన్యం. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం, టాస్క్‌ఫోర్స్ సమీపంలో ఓ సర్కిల్‌ను స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలు, వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేశారు. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇప్పుడు నిర్వహణ లేక అంధకారంలో ఉంది. లైట్లూ లేవు, వాటర్ ఫౌంటెనూ పని చేయదు. కోట్లు ఖర్చు చేసి, ఏం సాధించారంటూ ఈ ప్రాంతీయుల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి మరి!



పాత పందుల ఫారం వద్ద అక్రమంగా నిర్మిస్తున్న రేకుల షెడ్లు

పందుల ఫారం స్థలంపై కబ్జాదారుల కన్ను

- అక్రమంగా షెడ్ల నిర్మాణం

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో గత పాత పందుల ఫారం వద్ద ఉన్న ఖాళీ స్థలంపై కొందరు కబ్జాదారులు దృష్టి పడింది. ఈ ప్రాంతంలో పందులు పెంచేందుకు 40 ఏళ్ల క్రితం ఎస్సీలకు కేటాయించారు. ఈ స్థలంలో కొందరు ఎస్సీలు ఇళ్లను నిర్మించారు. ఇంకా చాలా స్థలం మిగిలి ఉంది. ఇప్పుడు ఆ మిగులు స్థలంపై కొందరు కన్నేశారు. ఈ క్రమంలో ఇటీవల ఓ షెడ్డును నిర్మితమైంది. దీని వెనుక కొందరు నేతల హస్తం కూడా ఉన్నట్టు భోగట్టా. కాగా, కబ్జాలను అరికట్టాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారే విమర్శ ఉంది. దీంతో కబ్జాదారులకు అడ్డులేకుండా పోతోందని పలువురు అంటున్నారు.

ఈ నేపథ్యంలో పందుల పెంపకానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ ఆక్రమణలపై స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు గవర ప్రపంచ మహాసభలు

సిరిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గవర ప్రపంచ మహాసభలను ఈ నెల 15న సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీఏ ఆడారి వెంకటరమణ తెలిపారు. 'గవర జాతీయుల ఆచారవ్యవహారాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. అత్యుత్తమ సేవలందించిన గవర సంఘాలకు ప్రత్యేక బహుమతి ప్రదానోత్సవం చేస్తామన్నారు. ఈ మహాసభల్లో గవర జాతీయులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్మికులపై యాజమాన్యం వైఖరి మారాలి

- సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ గౌరధ్యక్షుడు అయోధ్యరామ్



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం వ్యవహరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ప్లాంటులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పిస్తే కార్మికులు తమ అనుభవంతో అధిక ఉత్పత్తి సాధిస్తారనే విషయం ఇప్పుడు నిరూపితమైందన్నారు. అయితే కార్మిక వర్గాన్ని మాత్రం ఆర్థికంగా కుంగదీసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్రం కక్ష కట్టిడం దారుణమన్నారు. జీతాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు పట్టుగొమ్మలని, అటువంటి సంస్థలను నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్రను ఉద్యమాల తిప్పికొడతామని అయోధ్యరామ్ పేర్కొన్నారు. సమావేశంలోనాయకులు యు.రామస్వామి, కేఎం శ్రీనివాస్. పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు. గంగాధర్, కృష్ణమూర్తి, రాజు, సత్యనారాయణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు డీఈవో చంద్రకళకు సత్కారం



చంద్రకళను సత్కరిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి మూడు నెలల క్రితం బదిలీపై పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిగా వెళ్లిన ఎల్.చంద్రకళకు శనివారం ఉపాధ్యాయ సంఘాలు సత్కరించాయి. డాబా గార్డెన్స్‌లోని నెల్లూరు మెస్‌లో చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ విశాఖపట్నం ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి, గాజువాక ఎంఈవో సునీత, ఉపాధ్యాయ సంఘ నేతలు ఇ.పైడిరాజు, మద్దు శ్రీనివాసరావు, కృష్ణకుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మూడేళ్లపాటు విశాఖలో పనిచేశానని, విధి నిర్వహణలో అందరి సహకారం అందించారన్నారు.ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పూతి వెంకటరెడ్డిని సత్కరిస్తున్న ఫిల్మ్ ఛాంబర్స్ సభ్యులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంత్యోత్సవాలను డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పూతి వెంకటరెడ్డిని ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం పూతి వెంకటరెడ్డి మాట్లాడుతూ నందమూరి నట విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ.ఎం.రత్నం, ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జోనల్ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు సూచించారు. సమీపంలోని సచివాలయానికి వెళ్లి బీఎల్‌ఓకు దరఖాస్తు, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో జత చేసి అందిస్తే ఓటరుగా నమోదు చేస్తారన్నారు. కార్డులో చిరునామా, తప్పుల సవరణకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 24 వరకు గడువు ఉందన్నారు. స్వయంగా దరఖాస్తు అందజేసినా, లేదా ఆన్‌లైన్‌లో ఓటరు సర్వీస్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

'మద్యం దుకాణానికి అనుమతి వద్దు'

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జ్ఞానాపురంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని, అనుమతి ఇవ్వవద్దని కోరారు. పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు.

సాయిబాబా మందిరంలో దత్త జయంతి



సాయిబాబాకు అన్నాభిషేకం

అక్కయ్యపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దత్త జయంతి సందర్భంగా రైల్వే న్యూకాలనీ సాయిబాబా ధ్యాన మందిరంలో బాబాకు భక్తుల స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పార్చన జరిపారు. మాలధారులకు పెడుతున్న అన్నప్రసాద కార్యక్రమం శనివారంతో 41 రోజులు పూర్తి చేసుకుందని, ఇంతవరకు 9 వేల మందికి భిక్షపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు ప్రతిష్ఠాత్మక ఎన్‌ఏఏసీ (నాక్) ఏ గ్రేడ్ కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ఇటీవల ఎన్ఏఏసీ బృందం కళాశాలలో అన్ని విభాగాలను తనిఖీ చేసి 3.17 జీపీఏతో ఏ గ్రేడ్ కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

సీతంపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

సీతంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలోని వెన్నెల ఫంక్షన్ హాల్ వద్ద కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రూ.7 లక్షల జీవీఎంసీ నిధులతో కల్వర్ట్ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డీఈ విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, పారిశుధ్య పర్యవేక్షకుడు సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

'జగన్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు'

డాబాగార్డెన్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి)కు లేదని వైసీపీ రాష్ట్ర నాయకుడు ఆల్ఫా కృష్ణ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం అవంతి శ్రీనివాస్ పార్టీలు మార్చేస్తారన్నారు. నిబద్ధత, నీతి, నిజాయతీ, విశ్వాసం అవంతికి లేవన్నారు. రాజీనామా సమయంలో కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, జగన్‌పైన, పార్టీపైన చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ప్రజాసేవ కోసం విశ్రాంతి తీసుకుంటాననడం హాస్యాస్పదమన్నారు.

కేఆర్ఎం కాలనీ రోడ్లు కంపు...కంపు

యూజీడీ తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్లపైకి మురుగు నీరు... మురుగునీటిలోనే ప్రయాణంతో బాటసారుల అవస్థలు



కెఆర్ఎం కాలనీకి వెళ్లే రహదారిలో చేపడుతున్న పనులు



నక్కవానిపాలెం, కెఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం వెళ్లే కూడలిలో మురుగునీరు

సీతమ్మధార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు అనుసంధానమైన ప్రధాన కూడలిలో కొద్ది రోజులుగా మురుగు నీరు పారుతూనే ఉంది. నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు కూడలి మద్దిలపాలెం, చైతన్యనగర్, కెఆర్ఎం కాలనీ, సీతమ్మధార తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన కూడలిలో యూజీడీ నుంచి మురుగునీరు కొద్ది రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తూనే ఉంది. అటుగా ప్రయాణించే వారంతా మురుగు నీటి నుంచే వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. పాదచారులు నడిచి వెళ్లేటప్పుడు అటుగా వాహనాలు వస్తే మురుగు నీరు వారిపై తుల్లుతోంది. ద్విచక్ర వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. బాబోయ్ కంపు.. కంపు.. భరించలేకపోతున్నామంటూ స్థానిక నివాసితులు వాపోతున్నారు. కొద్ది రోజులుగా కెఆర్ఎం కాలనీ లోనికి వెళ్లే రహదారిలో యూజీడీ పనులు చేపడుతున్నారు. జేసీబీతో రోడ్డును పెద్దగా తవ్వుతున్నారు. ఈ నేపథ్యంలో యూజీడీ నుంచి వచ్చే మురుగు నీరు కాలువల గుండా వెళ్లే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్డుపై మురుగు ఉబికి వస్తోంది. జేసీబీతో తవ్విన మట్టి కూడా రోడ్డుపై అడ్డంగా వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎటువంటి సూచికలు పెట్టకుండా ఇలా పనులు చేపట్టడం శోచనీయమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో పనులు నిలిపివేస్తే పెద్ద ఎత్తున యూజీడీ నుంచి మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. అధికారులు జోక్యం చేసుకుని మురుగు నీరు పారకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంధన వనరుల పొదుపు అత్యవసరం

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఇతర అధికారులు

సీతమ్మధార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంధన వనరులను పొదుపు చేయాలని, ఇళ్ల మేడలపై సౌరశక్తి పొందే ఏర్పాట్లు చేసుకోవాలని వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్ పొదుపునకు సంబంధించిన గోడపత్రికను, కరపత్రాలను సంస్థ కార్యాలయంలో సీఎండీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల అవసరాల దృష్ట్యా ఇంధన వనరులను వృథా చేయరాదని, విద్యుత్ పొదుపు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఈ నెల 20 వరకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచేందుకు ఎల్ఈడీ బల్బుల వినియోగం, ఇంధన పొదుపు చిట్కాలు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగంతో ప్రయోజనాలు, విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు సదస్సులు పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఈపీడీసీఎల్ ఉద్యోగులంతా ఇళ్లపైనే సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకొనే విధంగా చొరవ చూపాలన్నారు. 11 జిల్లాల ఎస్ఈలకు ఈ విషయమై ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.శ్రీనివాసరావు, బి.కె. నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుమన్, పి.జ్యోతి, సీహెచ్ రామభద్రశాస్త్రి పాల్గొన్నారు.

సుస్థిర విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలోని ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. సెంటర్ ఛైర్మన్ డాక్టర్ కె.వి.రామమోహన్‌రావు మాట్లాడుతూ ఇంధన సంరక్షణ, సుస్థిర విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఈ సంవత్సరం థీమ్‌ను పవరింగ్ సస్టైనబిలిటీ ఎవ్రీ వాట్ కౌంట్స్‌గా ఎంచుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.వి. రమణరావు మాట్లాడుతూ ఇందన సామర్థ్యానికి, సుస్థిర ఇంధన విధానాలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. అతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ చల్లా సురేష్, కమిటీ సభ్యులు, కార్పొరేట్ సభ్యులు, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.



కలిసిన గంటా, ముత్తంశెట్టి

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమునిపట్నం నియోజకవర్గం నుంచి ఇటీవల ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు నువ్వా?, నేనా? అన్నట్టు తలపడ్డారు. ఒకరు టీడీపీ తరపున, మరొకరు వైసీపీ తరపున పోటీ చేశారు. గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇద్దరి మధ్య చాలాకాలంగా అంత సఖ్యత లేదు. తాజాగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. కొన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం వీరిద్దరూ హైదరాబాద్‌లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. అల్లు అర్జున్ పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఓ అభిమాని చనిపోవడంతో ఆయన్ను శుక్రవారం అరెస్టు చేశారు. శనివారం విడుదలైన అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి గంటా, ముత్తంశెట్టి వేర్వేరుగా వెళ్లారు. అక్కడ ఇద్దరూ కలిశారు. ముత్తంశెట్టి త్వరలో కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

గురజాడ కవిత్వం అజరామరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు తదితరులు

సీతంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ కవిత్వం అజరామరమని, తన రచనల ద్వారా సమాజంలో మార్పు ఆశించి కృతకృత్యుడయ్యారని రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ద్వారకానగర్ లోని పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి, గురజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా-భారత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ 109వ వర్ధంతి సభ, యువ చైతన్య దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీ పేరేమిటి గురజాడ కథలు, మహా కవితా ఖండికలు, ప్రకాశిక సంచికలను ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యానికి గురజాడ నూతన దశ-దిశ నిర్దేశించారని, ముత్యాల సరాలు అనే చందస్సు రచించి తెలుగు కవితామతల్లికి విలువైన హారాన్ని సమర్పించారని రాజేశ్వరరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురజాడ ఫౌండేషన్ సంచాలకులు డాక్టర్ కొవ్వలి గోపాల కృష్ణ, డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య పి.సోమరాజు, డాక్టర్ ఎం.విజయ్‌గోపాల్, సిహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కెవిఎస్ మూర్తి, బి.రాధారాణి, గండికోట సుబ్బలక్ష్మి, డాక్టర్ సిహెచ్ నిర్మలదేవి, పరవస్తు ఫణిశయన సూరి పాల్గొన్నారు.

మహిళల హాకీకి అర్హుల ఎంపిక



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారిణులను ఎంపిక చేశారు. ఏయూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య షోరోన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ మహిళలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని మహిళలకు సూచించారు. ఎంపిక కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, దుర్గారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన



కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలిపే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మర్రిపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 62వ వ్యవస్థాపక దినోత్సవం 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-2లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని లలితకుమారి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యాబోధనతో ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత కేంద్రీయ విద్యాలయాలదేనన్నారు. శనివారం వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోవడం సంతోషాన్నిచ్చే సందర్భమన్నారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రరావు, బాలాజీ, శివకుమార్, లక్ష్మీపాపాయి, జ్యోతిప్రకాష్, జ్యోత్స్న పాల్గొన్నారు.

'సహకార ఉద్యమంలో మానం ఆంజనేయులు రాజీలేని పోరు'



మానం ఆంజనేయులును సత్కరించిన సహకార బ్యాంకు ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యమంలో దశాబ్దాల పాటు రాజీలేని పోరు సాగించిన యోధుడు మానం ఆంజనేయులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ వ్యవస్థాపకులు అయిన ఆంజనేయుల అభినందన సభ శనివారం కూకట్‌పల్లిలోని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్థిక అసమానతల నివారణకు సహకార వ్యవస్థే పరిష్కారం అన్నారు. ప్రభుత్వాల నుంచి ఏ రూపంలో ఆర్థిక సాయం పొందినా సహకార వ్యవస్థలు బతకవన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా ఆంజనేయులు పనిచేయడం సాధారణ విషయం కాదని, ఆయన అనుభవం వృథా కాదన్నారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి. రామారావు మాట్లాడుతూ.. ఏటీఎంలు వచ్చాక బ్యాంకులకు వచ్చే జనం తగ్గారని, కానీ విశాఖ సహకార బ్యాంకులో ఎప్పుడూ చూసినా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు కనిపిస్తారన్నారు. రూ.కోటి ప్రారంభమైన బ్యాంకు లావాదేవీలు రూ.7675 కోట్లకు పెంచారని, ఎలాంటి మకిలి అంటకుండా 30 ఏళ్లు పనిచేశారని ఆంజనేయుల సేవలను కొనియాడారు. నాఫ్కాబ్ డైరెక్టర్ వేమిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సహకారోద్యమ భీష్ముడిగా అభివర్ణించారు. బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. సహకార వ్యవస్థ పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంచారన్నారు.

మెడికల్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు అవశ్యం

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా ఆయన వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ మెడికల్ టెక్నాలజీలో నిత్యం నూతన ఆవిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో దేశాల మధ్య పరస్పర సహకారం చాలా ముఖ్యమన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ డెలివరీలు, ఇన్నోవేషన్, స్కేలింగ్ వంటి రంగాలపై దృష్టిసారించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు పాల్గొన్న ఈ సదస్సులో 50 ఎంవోయూలు జరిగాయి. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు వ్యూహాలు ఆవిష్కరించారు.

28 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

... 5వ పేజీ తరువాయి

వెళ్లారు. పినగాడి సంఘానికి తప్ప మిగిలిన వాటిలో దాదాపు అన్నిచోట్ల ఏకగ్రీవాలకు ఓటర్లు మొగ్గుచూపారు. పినగాడిలో కూటమి పార్టీలోనే రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఎన్నిక నిర్వహించారు. ఇంకా కాపులుప్పాడ, గంభీరం సంఘాల్లో మూడేసి ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికలు జరగలేదు. మొత్తం 174లో 162 ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యులపై ఏకాభిప్రాయం కుదిరింది. ఆ తరువాత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వారంతా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. పినగాడిలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం సభ్యులు తమలో ఒకరిని అధ్యక్షునిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయించుకోవడంతో జిల్లాలోని 29 సంఘాలనూ కూటమి పార్టీల సానుభూతిపరులే చేజిక్కించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ పద్మనాభం మండలంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 29 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తయినట్టు జల వనరుల శాఖ డీఈ, ఎన్నికల నోడల్ అధికారి జెస్వామి నాయుడు తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలపై విజి'లెన్స్'

... 5వ పేజీ తరువాయి

రెండు, మూడు పర్యాయాలు తనిఖీ చేసి ఏపీఐఐసీకి లేఖలు రాసినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ గనుల శాఖ విజిలెన్స్ అధికారులు రెండు నెలల క్రితం ఒకసారి తనిఖీ చేశారు. తాజాగా తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి కొలతలు వేశారు. ఆరు ప్లాట్లలో గ్రావెల్ ఫిల్లింగ్ చేసినట్టు గుర్తించారు. అయితే ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించారనేది లెక్కలు వేస్తున్నారు. త్వరలో పారిశ్రామిక సంస్థలు/వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించారు.

లైక్స్ లేవాయె, కామెంట్స్ రావాయె..

... 5వ పేజీ తరువాయి

ఫాలోవర్స్, ఫ్రెండ్స్ ఉన్నా, వారికి ఎక్కువ కామెంట్లు వస్తున్నా చూసి చాలామంది తట్టుకోలేకపోతుంటారని చెబుతున్నారు. వారి స్థాయిలో తనకు రావడం లేదన్న బాధతో తెగ మథనపడుతుంటారని నిపుణులు చెబుతున్నారు. తినేందుకు ఇష్టపడరని, నిద్ర కూడా సరిగా పోరని పేర్కొంటున్నారు. ఇది విద్యార్థుల్లో అధికంగా కనిపిస్తోందని, వయసుతో సంబంధం లేకుండా మహిళల్లోనూ ఇటువంటి సమస్య ఉన్నట్టు చెబుతున్నారు.

వేధింపులు: ఇక భిన్నమైన అంశాలపై వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారికి రకరకాల కామెంట్లు వస్తుంటాయి. కొన్ని అసభ్యకరంగా కూడా ఉంటాయి. ఇటువంటి కామెంట్లతో ఇబ్బంది పడుతున్నవాళ్లు ఉన్నారు. కొందరు వేధింపులకు గురిచేస్తుండడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై నిపుణులను సంప్రతిస్తున్న వారి సంఖ్య పెరిగింది. వీరిలో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. యూట్యూబ్ వీడియోలు, రీల్స్ చేసే వారికి ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

పోల్చి చూసుకోవడం వల్లే ఇబ్బందులు

సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టులకు వచ్చే రియాక్షన్స్ చూసుకుంటూ చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఇది చాలా చిన్న విషయం అని గుర్తించడం లేదు. ఇదంతా ఇతరులతో పోల్చుకోవడం వల్ల వస్తున్న ఇబ్బంది. ఒకసారి పోస్టు పెట్టిన తరువాత గంటల తరబడి వాటికి వచ్చిన రియాక్షన్స్ లెక్కించుకుంటూ కూర్చుంటున్నారు. గంటల తరబడి సామాజిక మాధ్యమాలకు సమయాన్ని వెచ్చించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కొన్నిసార్లు స్నేహితుల మధ్య గొడవకు కూడా ఇది కారణం అవుతోంది. పిల్లాడు దిగులుగా ఉంటున్నాడని, ఎవరితో మాట్లాడడం లేదని కొందరు తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం ఏమిటని ఆరా తీస్తే ఈ విషయాలను చెబుతున్నారు. **-డాక్టర్ ఎన్ఎన్ నిహాల్, మానసిక వైద్య నిపుణులు**

ఉక్కు కార్మికులకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్నా కార్మికులు, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెల జీతం 50 శాతం, అక్టోబరు నెల జీతం 35 శాతం పెండింగ్ పెట్టారు. నవంబరు నెల జీతం డిసెంబరు మొదటి వారంలోనే ఇవ్వాలి. కానీ సగం నెల గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. స్టీల్ ప్లాంటుకు ఎంఓఐఎస్ నుంచి డిప్యూటేషన్‌పై సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఇలాంటి దుర్భరమైన పరిస్థితి వచ్చిందని ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. ఇక్కడి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సీఎండీ తాను మాత్రం ఎంఓఐఎల్ నుంచి ఒకటో తేదీనే జీతం అందుకుంటున్నారు. అలాగే ఓఎస్‌డీ ఇక్కడ అన్ని వసతులు పొందుతూ, ఎన్ఎండీసీ నుంచి జీతం తీసుకుంటున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద పనిచేస్తున్న కార్మికులు మాత్రం జీతాలందక నానా ఇబ్బందులు పడుతున్నారు. పదిహేనో తేదీ వరకూ జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఉద్యోగులు, కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి దృష్టికి ఎంపీ శ్రీభరత్ తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. జీతాలు ఇవ్వడానికే ఏడిపిస్తున్న కేంద్ర పెద్దలు ప్లాంటును నష్టాల నుంచి గట్టెక్కిస్తామంటే ఎలా నమ్మాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

జిల్లా స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్

... 5వ పేజీ తరువాయి

లేదు. గత ప్రభుత్వం వాటి నిర్వహణ పట్టించుకోలేదని, తాము అన్నింటినీ అందుబాటులోకి తెస్తామని హోం శాఖ మంత్రి అనిత ఇటీవల ప్రకటించారు. వాటి నుంచి అందే సమాచారాన్ని పోలీసులు వారి కేసుల దర్యాప్తునకు ఉపయోగించుకుంటారు. ఇప్పుడు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటయ్యే కేంద్రం ద్వారా సమగ్ర పరిశీలన చేస్తూ నేరాలు జరగకుండా, జరిగినప్పుడు వెంటనే అప్రమత్తం చేసేలా చర్యలు చేపడతారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం మేరకు ఇది ఏప్రిల్ నుంచి పనిచేయాల్సి ఉంది. కలెక్టరేట్‌లో ఈ భవన నిర్మాణం ఇప్పటికే 70 శాతం మేరకు పూర్తయింది.

ప్రమాదాల కూడలి.. పెదగదిలి

- ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు
- ఈ జంక్షన్ మీదుగా వెళ్లాలంటేనే వెనుకంజ వేస్తున్న వాహనదారులు


నిత్యం వాహనాల రద్దీతో ఉండే పెదగదిలి జంక్షన్

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలి జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యగా ఇబ్బందిగా తయారైంది. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. విశాలంగా ఉండే ఈ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు లేవు. దీంత వాహనాల రాకపోకలపై నియంత్రణ లేక ఏ వాహనం ఎటు పోతుందో తెలియని గందరగోళం పరిస్థితి నెలకొంటోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో తోటగరువు జంక్షన్ నుంచి నిత్యం వందలాది మంది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధానంగా స్కూళ్ల నుంచి వచ్చే విద్యార్థులు, వాహనాలు ఎక్కువగా ఉంటాయి. నగరం నుంచి హనుమంతవాక జంక్షన్ మీదుగా సింహాచలం వెళ్లే వాహనాలు.., సింహాచలం నుంచి నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వెహికల్స్ వస్తుంటాయి. విశాలమైన రోడ్డు కావడంతో వేగంగా వాహనాలు నడుపుతుంటారు. అయితే ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో ఎవరికి వారు వాహనాలు తొందరగా పోనివ్వాలనే ఉద్దేశంతో వెళుతుంటారు. దీనివల్ల ఈ జంక్షన్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఈ ప్రాంతంలో వాహనాల నియంత్రణకు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను లేదా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. అయితే ఇది కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పెదగదిలి జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికి చక్కని వేదికలు రెవెన్యూ సదస్సులు

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, వేదికపై కార్పొరేటర్ రామలక్ష్మి, తహసీల్దార్ కిరణ్ తదితరులు


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న స్థానికులు

ఆరిలోవ, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి వివాదాలు, తాత్సారం లేకుండా భూసమస్యలు పరిష్కారం అయ్యేందుకు రెవెన్యూ చక్కని వేదికలు అని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ప్రతి ప్రజా సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. శనివారం జీవీఎంసీ 9, 10, 11 వార్డులకు సంబంధించి పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ యజమానుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుకు రశీదు ఇస్తారని, అనంతరం అధికారులు పరిశీలించి గరిష్ఠంగా 45 రోజుల్లో పరిష్కరిస్తారన్నారు. గత ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చూపలేదు సరికదా మరింత చిక్కుల్లో పడేసిందన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ భవనాన్ని నిర్మిద్దామన్నా స్థలం లభించని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం భూముల పరిరక్షణ, ఆక్రమిత స్థలాల స్వాధీనం వల్ల కొంత భూమి సేకరించే అవకాశం ఉంటుందన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు 100 గజాలలోపు ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా పట్టాలు ఇచ్చామని, 100 గజాల దాటి ఇల్లు కట్టుకున్న వారికి అతి తక్కువ రేటుకు పట్టాలు ఇచ్చామన్నా చెప్పారు. కానీ వైసీపీ ప్రభుత్వం ఇంతవరకూ మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

ఈ నెల 16న ఆరిలోవలోని హిందీ కళాశాల వద్ద 12, 13 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తహసీల్దారు పాల్ కిరణ్, జోనల్ కమిషనర్-2 ఫణిరామ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, పలువురు అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రమణీయం కూచిపూడి నృత్యం


కిశోర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న గండి బాబ్జీ, నిర్వాహకులు

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శనలు రమణీయంగా సాగాయి. కళాకారిణుల చక్కని హావభావాలతో సాగిన నృత్యాలకు చప్పట్లు మారుమోగాయి. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ప్రోత్సాహంతో విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపరంపర-24 పేరుతో నిర్వహించిన ఈ నృత్యప్రదర్శనలు ఆద్యంతగా రక్తి కట్టించాయి. అంతర్జాతీయ ఒడిస్సీ కళాకారులు ఆర్యదత్త, కథక్ నృత్య కళకారుడు గర్మి ఆర్య నృత్యాలు మంత్రముగ్ధులను చేశాయి.

ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వహకులు, కూచిపూడి నృత్య కళాకారుడు మొసలి కంటి కిషోర్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ సీడ్స్ అండ్ అగ్రికల్చరల్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ చేతుల మీదుగా నిర్వాహకులు కళారత్న వెంపటి రవిశంకర్ జీవిత సాఫల్య అవార్డు ప్రదానం చేసి సత్కరించారు.

ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ భారతదేశం కళలకు పుట్టినిల్లు అన్నారు. కళలను ప్రోత్సహించి మన సంస్కృతీసంప్రదాయాలు పరిరక్షించడమే కాకుండా కళాకారులను ఆదిరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంస్థల నిర్వహకులు ఎం.ఎస్. శ్రీనివాస్, శ్రీధర్ బిత్ర, విక్రమ్‌కుమార్, టేకుమల్ల శ్యామల, కన్నం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శనలలో పాల్గొన్న కళాకారిణులు

ఆర్గానిక్ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా సత్వ నేచురల్ స్టాల్


కొబ్బరాకులు, బంతిపూల అలంకరణలో ఆకట్టుకుంటున్న సత్వ నేచురల్స్ స్టాల్

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో సీతమ్మధార ప్రాంతంలోని సత్వ నేచురల్స్ నిర్వహకులు ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శకులకు ఆకట్టుకుంటోంది.

ఈ స్టాల్‌ను కొబ్బరాకులతో పెళ్లిపందిరిలా ఏర్పాటు చేసి బంతిపూలతో అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్టాల్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్, పాత తరానికి చెందిన ఇత్తడి వస్తువులు, రాతి రోకళ్లు, రోల్లు, సన్నికాళ్లు, మట్టి వస్తువులు, చెక్కతో తయారు చేసిన వస్తువులు, ఇంటిల్లిపాదీ ఉపయోగించే అనేక రకాల ఉత్పత్తులను సత్వ నేచురల్స్ నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. అలాగే అంతరించిపోతున్న పిచ్చికలు, పావురాలను కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు రైతులు వద్ద నుంచి వరికంకులు సేకరించి వినియోగదార్లకు పంపిణీ చేస్తున్నారు.

రవీంద్రనగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్


రవీంద్రనగర్ జంక్షన్‌లో నిలిచిపోయిన వాహనాలు

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డు ఆఖరి బస్టాప్ వద్ద రవీంద్రనగర్ జంక్షన్‌లో శనివారం ఉదయం ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. ఒక్కసారిగా వాహనాలు లెక్కకు మించి రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రవీంద్రనగర్‌లో రెవెన్యూ సదస్సు ఉండడం, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొనడంతో ఆ కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్థానిక నేతలు జనాన్ని తరలించారు. దీంతో పాటు సదస్సుకు వచ్చే వారితో ఈ ప్రాంతం సందడి నెలకొంది. అధికంగా వాహనాలు రావడంతో తప్పుకోవడానికి ఇబ్బంది ఎదురైంది. దీంతో ఎప్పుడూ సాధారణంగా ఉండే ఈ జంక్షన్‌లో తీవ్ర రద్దీ నెలకొంది. ఫలితంగా వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు.

పోలీస్ క్వార్టర్స్‌లో అపరిశుభ్రత

- నెలల తరబడి చెత్త తొలగించని పారిశుధ్య సిబ్బంది
- దుర్గంధం, దోమల బెడదతో స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన క్వార్టర్స్‌లో పడి ఉన్న చెత్త

మద్దిలపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పరిధిలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. టెన్నిస్ కోర్టు, క్వార్టర్స్ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. ఆయా ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. ఇక్కడ రైతు బజార్ ఉన్నందున బజార్‌లో చెత్త కూడా టెన్నిస్‌కోర్టు ఆవరణలో పడేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది, కార్మికులుఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు.


టెన్నిస్ కోర్టు ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

దీంతో నెలల తరబడి ఇక్కడ చెత్త పేరుకుపోయి కుప్పలుగా మారిపోయాయి. ఈ చెత్తను తరలించాలని పలుమార్లు సచివాలయ శానిటేషన్ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త నిల్వ ఉండడంతో వర్షం పడినప్పుడు తడిసి కుళ్లిపోతోంది. దీంతో దుర్వాసన వెలువడుతోంది. ఇక్కడ టెన్నిస్ కోర్టు ఉండడంతో చాలా మంది క్రీడాకారులు వస్తుంటారు. అయితే దుర్గంధంతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లైట్లు లేవు.. ఫౌంటెన్ పని చేయదు

- అంధకారంలో ఏఎస్ రాజా మైదానం జంక్షన్


దీపాలు వెలగకపోవడతో చిమ్మచీకటిలో ఉన్న ఏఎస్ రాజా మైదానం జంక్షన్

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. కొన్ని రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్టు లెక్కలు చూపతున్నారు. కానీ ఆశించిన ఫలితం మాత్రం శూన్యం. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం, టాస్క్‌ఫోర్స్ సమీపంలో ఓ సర్కిల్‌ను స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించారు. రంగు రంగుల విద్యుత్తు దీపాలు, వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేశారు. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఇప్పుడు నిర్వహణ లేక అంధకారంలో ఉంది. లైట్లూ లేవు, వాటర్ ఫౌంటెనూ పని చేయదు. కోట్లు ఖర్చు చేసి, ఏం సాధించారంటూ ఈ ప్రాంతీయుల ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి మరి!

☛ సంక్షిప్తంగా..

ధనుర్మాస ఉత్సవాలకు ఆలయాలు సిద్ధం

రేపు ఉదయం గం. 6 : 57కు నెలగంట



వెంకోజీపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :వేంకటేశ్వరుడి ఆలయాల్లో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయాల నిర్వాహకులు ఆలయాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దా రు. రంగులను కూడా వేయిస్తున్నారు.

ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామిఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావుతెలిపారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ ప్రతిరోజూ గోదాదేవికి పూజలు నిర్వహిస్తారు. 16న ఉదయం 6.57 నిమిషాలకు ధనుర్మాస వ్రతం (నెలగంట) ప్రారంభం అవుతుందని వారు తెలిపారు. వచ్చే నెల 13 వరకు ఈ ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. వచ్చే నెల 10న ముక్కోటి ఏకాదశి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, నిత్యం ఉండే ఉత్తర ద్వార దర్శనంతో పాటు గోదాఅమ్మవారి అభిషేకం, తోమాలసేవ వంటి నిర్వహించనున్నట్టు తెలిపారు. జనవరి 11న స్వామి వారికి కుడారై ఉత్సవం, 13న గోదాదేవి కల్యాణంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హరికథ, డాక్టర్ శారదాసుబ్రహ్మణ్యంతో భక్తి కీర్తనల ఆలాపన, చైతన్య బ్రదర్స్‌తో అన్నమాచార్య గానామృతం, రఘునాథతో అన్నమాచార్య కీర్తన కచేరీ ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే కొత్త వెంకోజీపాలెం శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు కిషోర్ శర్మ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ జీవీఎంసీ కమిషనర్‌కు వినతి


జీవీఎంసీ కమిషనర్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ సునీత

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత వినతిపత్రం అందజేశారు. కౌన్సిల్ సమావేశం నేపథ్యంలో కమిషనర్‌ను కలిసిన ఆమె తమ వార్డులో రామకృష్ణాపురం బ్యాలెన్స్ రోడ్లు, అల్లూరి సీతారామరాజు లే అవుట్ రోడ్లు, పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వెనుక భాగాన రిటర్నింగ్ వాల్, శ్రీకృష్ణాపురంలో గల శ్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణం, క్రిష్టియన్ కమ్యూనిటి శ్మశాన వాటిక, కాంపౌండ్‌వాల్ నిర్మాణం, శివశంకర్ నగరలో రోడ్లు, కాలవల నిర్మాణం, సాయినగర్‌లో రోడ్డు కాలవల నిర్మాణం, భగత్ సింగ్‌నగర్‌లో కొండవాలు ప్రాంతంలో నీటి ఎద్దడి నివారణ, ప్రతీ రోజు అన్ని ప్రాంతాలకు తాగు నీటి సరఫరా వంటి ప్రధాన సమస్యలు ఉన్నా యని పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 24, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226


పాత పందుల ఫారం వద్ద అక్రమంగా నిర్మిస్తున్న రేకులు షెడ్లు

పందుల ఫారం స్థలంపై కబ్జాదారుల కన్ను

- అక్రమంగా షెడ్ల నిర్మాణం

ఆరిలోవ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 13వ వార్డులో గల రామకృష్ణాపురంలో గత పాత పందుల ఫారం వద్ద ఉన్న ఖాళీ స్థలంపై కొందరు కబ్జాదారులు దృష్టి పడింది. ఈ ప్రాంతంలో పందులు పెంచేందుకు 40 ఏళ్ల క్రితం ఎస్సీలకు కేటాయించారు. ఈ స్థలంలో కొందరు ఎస్సీలు ఇళ్లను నిర్మించారు. ఇంకా చాలా స్థలం మిగిలి ఉంది. ఇప్పుడు ఆ మిగులు స్థలంపై కొందరు కన్నేశారు. ఈ క్రమంలో ఇటీవల ఓ షెడ్డును నిర్మితమైంది. దీని వెనుక కొందరు నేతల హస్తం కూడా ఉన్నట్టు భోగట్టా. కాగా, కబ్జాలను అరికట్టాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారే విమర్శ ఉంది. దీంతో కబ్జాదారులకు అడ్డులేకుండా పోతోందని పలువురు అంటున్నారు.

ఈ నేపథ్యంలో పందుల పెంపకానికి కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ ఆక్రమణలపై స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు గవర ప్రపంచ మహాసభలు

సిరిపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గవర ప్రపంచ మహాసభలను ఈ నెల 15న సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు గవర ప్రపంచ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సీఏ ఆడారి వెంకటరమణ తెలిపారు. 'గవర జాతీయుల ఆచారవ్యవహారాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. అత్యుత్తమ సేవలందించిన గవర సంఘాలకు ప్రత్యేక బహుమతి ప్రదానోత్సవం చేస్తామన్నారు. ఈ మహాసభల్లో గవర జాతీయులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్మికులపై యాజమాన్యం వైఖరి మారాలి

- సీఐటీయూ స్టీల్‌ప్లాంట్ గౌరధ్యక్షుడు అయోధ్యరామ్



సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం వ్యవహరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ప్లాంటులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పిస్తే కార్మికులు తమ అనుభవంతో అధిక ఉత్పత్తి సాధిస్తారనే విషయం ఇప్పుడు నిరూపితమైందన్నారు. అయితే కార్మిక వర్గాన్ని మాత్రం ఆర్థికంగా కుంగదీసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్రం కక్ష కట్టిడం దారుణమన్నారు. జీతాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు పట్టుగొమ్మలని, అటువంటి సంస్థలను నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్రను ఉద్యమాల తిప్పికొడతామని అయోధ్యరామ్ పేర్కొన్నారు. సమావేశంలోనాయకులు యు.రామస్వామి, కేఎం శ్రీనివాస్. పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు. గంగాధర్, కృష్ణమూర్తి, రాజు, సత్యనారాయణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు డీఈవో చంద్రకళకు సత్కారం


చంద్రకళను సత్కరిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి మూడు నెలల క్రితం బదిలీపై పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారిగా వెళ్లిన ఎల్.చంద్రకళకు శనివారం ఉపాధ్యాయ సంఘాలు సత్కరించాయి. డాబా గార్డెన్స్‌లోని నెల్లూరు మెస్‌లో చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ విశాఖపట్నం ఆర్జేడీ విజయభాస్కర్, విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి, గాజువాక ఎంఈవో సునీత, ఉపాధ్యాయ సంఘ నేతలు ఇ.పైడిరాజు, మద్దు శ్రీనివాసరావు, కృష్ణకుమార్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మూడేళ్లపాటు విశాఖలో పనిచేశానని, విధి నిర్వహణలో అందరి సహకారం అందించారన్నారు.ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పూతి వెంకటరెడ్డిని సత్కరిస్తున్న ఫిల్మ్ ఛాంబర్స్ సభ్యులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వజ్రోత్సవాలను డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పూతి వెంకటరెడ్డిని ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం పూతి వెంకటరెడ్డి మాట్లాడుతూ నందమూరి నట విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఎ.ఎం.రత్నం, ప్రధాన కార్యదర్శి జె.వి.మోహన్‌గౌడ్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, నాగరాజు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జోనల్ పరిధిలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. సమీపంలోని సచివాలయానికి వెళ్లి బీఎల్ఓకు దరఖాస్తు, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో జత చేసి అందిస్తే ఓటరుగా నమోదు చేస్తారన్నారు. కార్డులో చిరునామా, తప్పుల సవరణకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 24 వరకు గడువు ఉందన్నారు. స్వయంగా దరఖాస్తు అందజేసినా, లేదా ఆన్‌లైన్‌లో ఓటరు సర్వీస్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

'మద్యం దుకాణానికి అనుమతి వద్దు'

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జ్ఞానాపురంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని, అనుమతి ఇవ్వవద్దని కోరారు. పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు.

సాయిబాబా మందిరంలో దత్త జయంతి



సాయిబాబాకు అన్నాభిషేకం

అక్కయ్యపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దత్త జయంతి సందర్భంగా రైల్వే న్యూకాలనీ సాయిబాబా ధ్యాన మందిరంలో బాబాకు భక్తుల స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు, అన్నాభిషేకాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పార్చన జరిపారు. మాలధారులకు పెడుతున్న అన్నప్రసాద కార్యక్రమం శనివారంతో 41 రోజులు పూర్తి చేసుకుందని, ఇంతవరకు 9 వేల మందికి భిక్షపెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

జ్ఞానాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు ప్రతిష్ఠాత్మక ఎన్ఏఏసీ (నాక్) ఏ గ్రేడ్ కేటాయించినట్లు ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ తెలిపారు. ఇటీవల ఎన్ఏఏసీ బృందం కళాశాలలో అన్ని విభాగాలను తనిఖీ చేసి 3.17 జీపీఏతో ఏ గ్రేడ్ కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందిని ఆమె అభినందించారు.

సీతంపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

సీతంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేటలోని వెన్నెల ఫంక్షన్ హాల్ వద్ద కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక అభివృద్ధి పనులను లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రూ.7 లక్షల జీవీఎంసీ నిధులతో కల్వర్ట్ తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డీఈ విజయ్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, పారిశుధ్య పర్యవేక్షకుడు సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

'జగన్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు'

డాబాగార్డెన్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి)కు లేదని వైసీపీ రాష్ట్ర నాయకుడు ఆల్ఫా కృష్ణ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం అవంతి శ్రీనివాస్ పార్టీలు మారుస్తారన్నారు. నిబద్ధత, నీతి, నిజాయతీ, విశ్వాసం అవంతికి లేవన్నారు. రాజీనామా సమయంలో కొన్ని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, జగన్‌పైన, పార్టీపైన చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ప్రజాసేవ కోసం విశ్రాంతి తీసుకుంటాననడం హాస్యాస్పదమన్నారు.

కేఆర్ఎం కాలనీ రోడ్లు కంపు...కంపు

యూజీడీ తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో రోడ్లపైకి మురుగు నీరు... మురుగునీటిలోనే ప్రయాణంతో బాటసారుల అవస్థలు



కెఆర్ఎం కాలనీకి వెళ్లే రహదారిలో చేపడుతున్న పనులు



నక్కవానిపాలెం, కెఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం వెళ్లే కూడలిలో మురుగునీరు

సీతమ్మధార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు అనుసంధానమైన ప్రధాన కూడలిలో కొద్ది రోజులుగా మురుగు నీరు పారుతూనే ఉంది. నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు కూడలి మద్దిలపాలెం, చైతన్యనగర్, కెఆర్ఎం కాలనీ, సీతమ్మధార తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన కూడలిలో యూజీడీ నుంచి మురుగునీరు కొద్ది రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తూనే ఉంది. అటుగా ప్రయాణించే వారంతా మురుగు నీటి నుంచే వెళ్లవలసిన దుస్థితి నెలకొంది. పాదచారులు నడిచి వెళ్లేటప్పుడు అటుగా వాహనాలు వస్తే మురుగు నీరు వారిపై తుల్లుతోంది. ద్విచక్ర వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. బాబోయ్ కంపు.. కంపు.. భరించలేకపోతున్నామంటూ స్థానిక నివాసితులు వాపోతున్నారు. కొద్ది రోజులుగా కెఆర్ఎం కాలనీ లోనికి వెళ్లే రహదారిలో యూజీడీ పనులు చేపడుతున్నారు. జేసీబీతో రోడ్డును పెద్దగా తవ్వుతున్నారు. ఈ నేపథ్యంలో యూజీడీ నుంచి వచ్చే మురుగు నీరు కాలువల గుండా వెళ్లే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. యూజీడీ మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్డుపై మురుగు ఉబికి వస్తోంది. జేసీబీతో తవ్విన మట్టి కూడా రోడ్డుపై అడ్డంగా వేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎటువంటి సూచికలు పెట్టకుండా ఇలా పనులు చేపట్టడం శోచనీయమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో పనులు నిలిపివేస్తే పెద్ద ఎత్తున యూజీడీ నుంచి మురుగు నీరు రోడ్డుపై ప్రవహించి ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. అధికారులు జోక్యం చేసుకుని మురుగు నీరు పారకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంధన వనరుల పొదుపు అత్యవసరం

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఇతర అధికారులు

సీతమ్మధార, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇంధన వనరులను పొదుపు చేయాలని, ఇళ్ల మేడలపై సౌరశక్తి పొందే ఏర్పాట్లు చేసుకోవాలని వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్ పొదుపునకు సంబంధించిన గోడ పత్రికను, కరపత్రాలను సంస్థ కార్యాలయంలో సీఎండీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల అవసరాల దృష్ట్యా ఇంధన వనరులను వృధా చేయరాదని, విద్యుత్ పొదుపు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఈ నెల 20 వరకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచేందుకు ఎల్ఈడీ బల్బుల వినియోగం, ఇంధన పొదుపు చిట్కాలు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల వినియోగంతో ప్రయోజనాలు, విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు, కళా ప్రదర్శనలు, పాఠశాల విద్యార్థులకు సదస్సులు పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఈపీడీసీఎల్ ఉద్యోగులంతా ఇళ్లపైనే సౌర విద్యుత్ పలకలు ఏర్పాటు చేసుకొనే విధంగా చొరవ చూపాలన్నారు. 11 జిల్లాల ఎస్ఈలకు ఈ విషయమై ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.శ్రీనివాసరావు, బి.కె. నాయుడు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుమన్, పి.జ్యోతి, సీహెచ్ రామభద్రశాస్త్రి పాల్గొన్నారు.

సుస్థిర విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం



ముఖ్య అతిథిని సత్కరిస్తున్న నిర్వాహకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలోని ఇంజనీర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో శనివారం జాతీయ ఇంధన సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. సెంటర్ ఛైర్మన్ డాక్టర్ కె.వి.రామమోహన్‌రావు మాట్లాడుతూ ఇంధన సంరక్షణ, సుస్థిర విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని వివరించారు. ఈ సంవత్సరం థీమ్‌ను పవరింగ్ సస్టైనబిలిటీ ఎవ్విర్ వాట్ కౌంట్స్‌గా ఎంచుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.వి. రమణరావు మాట్లాడుతూ ఇందన సామర్థ్యానికి, సుస్థిర ఇంధన విధానాలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. అతిథులను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ చల్లా సురేష్, కమిటీ సభ్యులు, కార్పొరేట్ సభ్యులు, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.



కలిసిన గంటా, ముత్తంశెట్టి

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమునిపట్నం నియోజకవర్గం నుంచి ఇటీవల ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు నువ్వా?, నేనా? అన్నట్టు తలపడ్డారు. ఒకరు టీడీపీ తరఫున, మరొకరు వైసీపీ తరఫున పోటీ చేశారు. గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుపొందారు. ఇద్దరి మధ్య చాలాకాలంగా అంత సఖ్యత లేదు. తాజాగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేశారు. కొన్నాళ్లు రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో శనివారం వీరిద్దరూ హైదరాబాద్‌లో చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. అల్లు అర్జున్ పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఓ అభిమాని చనిపోవడంతో ఆయన్ను శుక్రవారం అరెస్టు చేశారు. శనివారం విడుదలైన అల్లు అర్జున్‌ను పరామర్శించడానికి గంటా, ముత్తంశెట్టి వేర్వేరుగా వెళ్లారు. అక్కడ ఇద్దరూ కలిశారు. ముత్తంశెట్టి త్వరలో కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

గురజాడ కవిత్వం అజరామరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు తదితరులు

సీతంపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ కవిత్వం అజరామరమని, తన రచనల ద్వారా సమాజంలో మార్పు ఆశించి కృతకృత్యుడయ్యారని రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి, గురజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా-భారత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ 109వ వర్ధంతి సభ, యువ చైతన్య దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీ పేరేమిటి గురజాడ కథలు, మహా కవితా ఖండికలు, ప్రకాశిక సంచికలను ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యానికి గురజాడ నూతన దశ-దిశ నిర్దేశించారని, ముత్యాల సరాలు అనే చందస్సు రచించి తెలుగు కవితామతల్లికి విలువైన హారాన్ని సమర్పించారని రాజేశ్వరరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురజాడ ఫౌండేషన్ సంచాలకులు డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ, డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య పి.సోమరాజు, డాక్టర్ ఎం.విజయ్‌గోపాల్, సిహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, డాక్టర్ కెవిఎస్ మూర్తి, బి.రాధారాణి, గండికోట సుబ్బలక్ష్మి, డాక్టర్ సిహెచ్ నిర్మలదేవి, పరవస్తు పణిశయన సూరి పాల్గొన్నారు.

మహిళల హాకీకి అర్హుల ఎంపిక



విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారిణులను ఎంపిక చేశారు. ఏయూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, వర్సిటీ మహిళలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని మహిళలకు సూచించారు. ఎంపిక కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, దుర్గారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన



కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలిపే ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మర్రిపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 62వ వ్యవస్థాపక దినోత్సవం 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-2లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని లలితకుమారి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్యాబోధనతో ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఘనత కేంద్రీయ విద్యాలయాలదేనన్నారు. శనివారం వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోవడం సంతోషాన్నిచ్చే సందర్భమన్నారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రరావు, బాలాజీ, శివకుమార్, లక్ష్మీపాపాయి, జ్యోతిప్రకాష్, జ్యోత్స్న పాల్గొన్నారు.

'సహకార ఉద్యమంలో మానం ఆంజనేయులు రాజీలేని పోరు'



మానం ఆంజనేయులను సత్కరించిన సహకార బ్యాంకు ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యమంలో దశాబ్దాల పాటు రాజీలేని పోరు సాగించిన యోధుడు మానం ఆంజనేయులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ వ్యవస్థాపకులు అయిన ఆంజనేయుల అభినందన సభ శనివారం కూకట్‌పల్లిలోని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్థిక అసమానతల నివారణకు సహకార వ్యవస్థే పరిష్కారం అన్నారు. ప్రభుత్వాల నుంచి ఏ రూపంలో ఆర్థిక సాయం పొందినా సహకార వ్యవస్థలు బతకవన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌గా ఆంజనేయులు పనిచేయడం సాధారణ విషయం కాదని, ఆయన అనుభవం వృథా కాదన్నారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి. రామారావు మాట్లాడుతూ.. ఏటీఎంలు వచ్చాక బ్యాంకులకు వచ్చే జనం తగ్గారని, కానీ విశాఖ సహకార బ్యాంకులో ఎప్పుడూ చూసినా మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు కనిపిస్తారన్నారు. రూ.కోటి ప్రారంభమైన బ్యాంకు లావాదేవీలు రూ.7675 కోట్లకు పెంచారని, ఎలాంటి మకిలి అంటకుండా 30 ఏళ్లు పనిచేశారని ఆంజనేయుల సేవలను కొనియాడారు. నాఫ్కాబ్ డైరెక్టర్ వేమిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. సహకారోద్యమ భీష్ముడిగా అభివర్ణించారు. బ్యాంకు ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. సహకార వ్యవస్థ పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంచారన్నారు.

మెడికల్ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలు అవశ్యం

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా ఆయన వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తూ మెడికల్ టెక్నాలజీలో నిత్యం నూతన ఆవిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో దేశాల మధ్య పరస్పర సహకారం చాలా ముఖ్యమన్నారు. గ్లోబల్ హెల్త్‌కేర్ డెలివరీలు, ఇన్నోవేషన్, స్కేలింగ్ వంటి రంగాలపై దృష్టిసారించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు పాల్గొన్న ఈ సదస్సులో 50 ఎంవోయూలు జరిగాయి. ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు వ్యూహాలు ఆవిష్కరించారు.

28 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

... 5వ పేజీ తరువాయి

వెళ్లారు. పినగాడి సంఘానికి తప్ప మిగిలిన వాటిలో దాదాపు అన్నిచోట్ల ఏకగ్రీవాలకు ఓటర్లు మొగ్గుచూపారు. పినగాడిలో కూటమి పార్టీలోనే రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఎన్నిక నిర్వహించారు. ఇంకా కాపులుప్పాడ, గంభీరం సంఘాల్లో మూడేసి ప్రాదేశిక నియోజక వర్గాలకు ఎన్నికలు జరగలేదు. మొత్తం 174లో 162 ప్రాదేశిక నియోజకవర్గాలకు సభ్యులపై ఏకాభిప్రాయం కుదిరింది. ఆ తరువాత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వారంతా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. పినగాడిలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం సభ్యులు తమలో ఒకరిని అధ్యక్షునిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని వైసీపీ నిర్ణయించుకోవడంతో జిల్లాలోని 29 సంఘాలనూ కూటమి పార్టీల సానుభూతిపరులే చేజిక్కించుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ పద్మనాభం మండలంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 29 నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తయినట్టు జల వనరుల శాఖ డీఈ, ఎన్నికల నోడల్ అధికారి జెస్వామి నాయుడు తెలిపారు.

గ్రావెల్ తవ్వకాలపై విజి'లెన్స్'

... 5వ పేజీ తరువాయి

రెండు, మూడు పర్యాయాలు తనిఖీ చేసి ఏపీఐఐసీకి లేఖలు రాసినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ గనుల శాఖ విజిలెన్స్ అధికారులు రెండు నెలల క్రితం ఒకసారి తనిఖీ చేశారు. తాజాగా తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించి కొలతలు వేశారు. ఆరు ప్లాట్లలో గ్రావెల్ ఫిల్లింగ్ చేసినట్టు గుర్తించారు. అయితే ఎన్ని క్యూబిక్ మీటర్లు తరలించారనేది లెక్కలు వేస్తున్నారు. త్వరలో పారిశ్రామిక సంస్థలు/వ్యక్తులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించారు.

లైక్స్ లేవాయె, కామెంట్స్ రావాయె..

... 5వ పేజీ తరువాయి

ఫాలోవర్స్, ఫ్రెండ్స్ ఉన్నా, వారికి ఎక్కువ కామెంట్లు వస్తున్నా చూసి చాలామంది తట్టుకోలేకపోతుంటారని చెబుతున్నారు. వారి స్థాయిలో తనకు రావడం లేదన్న బాధతో తెగ మథనపడుతుంటారని నిపుణులు చెబుతున్నారు. తినేందుకు ఇష్టపడరని, నిద్ర కూడా సరిగా పోరని పేర్కొంటున్నారు. ఇది విద్యార్థుల్లో అధికంగా కనిపిస్తోందని, వయసుతో సంబంధం లేకుండా మహిళల్లోనూ ఇటువంటి సమస్య ఉన్నట్టు చెబుతున్నారు.

వేధింపులు: ఇక భిన్నమైన అంశాలపై వీడియోలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టే వారికి రకరకాల కామెంట్లు వస్తుంటాయి. కొన్ని అసభ్యకరంగా కూడా ఉంటాయి. ఇటువంటి కామెంట్లతో ఇబ్బంది పడుతున్నవాళ్లు ఉన్నారు. కొందరు వేధింపులకు గురిచేస్తుండడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై నిపుణులను సంప్రతిస్తున్న వారి సంఖ్య పెరిగింది. వీరిలో ఎక్కువగా మహిళలు ఉంటున్నారు. యూట్యూబ్ వీడియోలు, రీల్స్ చేసే వారికి ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.

పోల్చి చూసుకోవడం వల్లే ఇబ్బందులు

సామాజిక మాధ్యమాల్లో చేసే పోస్టులకు వచ్చే రియాక్షన్స్ చూసుకుంటూ చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఇది చాలా చిన్న విషయం అని గుర్తించడం లేదు. ఇదంతా ఇతరులతో పోల్చుకోవడం వల్ల వస్తున్న ఇబ్బంది. ఒకసారి పోస్టు పెట్టిన తరువాత గంటల తరబడి వాటికి వచ్చిన రియాక్షన్స్ లెక్కించుకుంటూ కూర్చుంటున్నారు. గంటల తరబడి సామాజిక మాధ్యమాలకు సమయాన్ని వెచ్చించడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. దీనిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కొన్నిసార్లు స్నేహితుల మధ్య గొడవకు కూడా ఇది కారణం అవుతోంది. పిల్లాడు దిగులుగా ఉంటున్నాడని, ఎవరితో మాట్లాడడం లేదని కొందరు తల్లిదండ్రులు చెబుతున్నారు. విషయం ఏమిటని ఆరా తీస్తే ఈ విషయాలను చెబుతున్నారు. **-డాక్టర్ ఎన్ఎన్ నిహాల్, మానసిక వైద్య నిపుణులు**

ఉక్కు కార్మికులకు అందని జీతాలు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్నా కార్మికులు, ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెల జీతం 50 శాతం, అక్టోబరు నెల జీతం 35 శాతం పెండింగ్ పెట్టారు. నవంబరు నెల జీతం డిసెంబరు మొదటి వారంలోనే ఇవ్వాలి. కానీ సగం నెల గడిచినా ఆ ఊసే ఎత్తడం లేదు. స్టీల్ ప్లాంటుకు ఎంఓఐఎస్ నుంచి డిప్యుటేషన్‌పై సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఇలాంటి దుర్భరమైన పరిస్థితి వచ్చిందని ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. ఇక్కడి ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సీఎండీ తాను మాత్రం ఎంఓఐఎల్ నుంచి ఒకటో తేదీనే జీతం అందుకుంటున్నారు. అలాగే ఓఎస్‌డీ ఇక్కడ అన్ని వసతులు పొందుతూ, ఎన్ఎండీసీ నుంచి జీతం తీసుకుంటున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద పనిచేస్తున్న కార్మికులు మాత్రం జీతాలందక నానా ఇబ్బందులు పడుతున్నారు. పదిహేనో తేదీ వరకూ జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఉద్యోగులు, కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యను కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి దృష్టికి ఎంపీ శ్రీభరత్ తీసుకువెళ్లినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. జీతాలు ఇవ్వడానికే ఏడిపిస్తున్న కేంద్ర పెద్దలు ప్లాంటును నష్టాల నుంచి గట్టెక్కిస్తామంటే ఎలా నమ్మాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

జిల్లా స్థాయిలో రియల్ టైమ్ గవర్నెన్స్

... 5వ పేజీ తరువాయి

లేదు. గత ప్రభుత్వం వాటి నిర్వహణ పట్టించుకోలేదని, తాము అన్నింటినీ అందుబాటులోకి తెస్తామని హోం శాఖా మంత్రి అనిత ఇటీవల ప్రకటించారు. వాటి నుంచి అందే సమాచారాన్ని పోలీసులు వారి కేసుల దర్యాప్తునకు ఉపయోగించుకుంటారు. ఇప్పుడు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటయ్యే కేంద్రం ద్వారా సమగ్ర పరిశీలన చేస్తూ నేరాలు జరగకుండా, జరిగినప్పుడు వెంటనే అప్రమత్తం చేసేలా చర్యలు చేపడతారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం మేరకు ఇది ఏప్రిల్ నుంచి పనిచేయాల్సి ఉంది. కలెక్టరేట్‌లో ఈ భవన నిర్మాణం ఇప్పటికే 70 శాతం మేరకు పూర్తయింది.

ప్రమాదం అంచున సరిపల్లి వంతెన!

నిత్యం వందలాది వాహనాలు బ్రిడ్జి మీదుగా రాకపోకలు

శిథిల స్థితికి చేరిన వంతెనపై ప్రయాణించేందుకు భీతిల్లుతున్న వాహనదారులు



సరిపల్లిలో శిథిలావస్థలో ఉన్న వంతెన

పెందుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత ప్రమాణాలకు అధికారులు పాతర వేస్తున్నారు. శిథిల వంతెనపై ప్రయాణం అంటే ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తోంది. పెందుర్తి మండలం సరిపల్లి వద్ద గల వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా ఉందని ప్రయాణికులు భీతిల్లుతున్నారు. పురాతనకాలం నుంచి ఏడు మదుముల వంతెనగా పిలుస్తున్న ఈ కట్టడం శిథిల స్థితికి చేరుకోవడంతో మూడు దశాబ్దాల కిందిట జరిగిన రహదారి విస్తరణలో దీన్ని పునర్నిర్మించారు. వంతెన కింద పెద్ద తూము లాంటి కాంక్రీట్‌తో కూడిన గొట్టాలు ఏర్పాటు చేసి నిర్మించారు. అప్పటి జనభా, వాహనాల రద్దీ దృష్ట్యా ఈ వంతెనపై ప్రయాణం సాఫీగానే సాగేది. ఇప్పుడు ఈ వంతెన శిథిల స్థితికి చేరుకుంటుంది. వంతెన పటుత్వం లోపించి అమర్చిన పైపు గొట్టాలు, కాంక్రీట్ బయటకు పెచ్చుల్లా ఊడుతున్నాయి. ఇనుప చువ్వలు బయటకు పొడుచుకువచ్చి చూపరులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వర్షపు నీటితో చెరువులు నిండాక మిగిలిన జలాలు ఈ వంతెన మదుముల ద్వారా బయటికి పోయేందుకు ఏర్పాటుచేసిన గొట్టాలు కుంగినట్లు కనిపిస్తున్నాయి. వంతెనపై రెయిలింగ్ నిర్మాణం చేపట్టకపోవడంతో పోల్స్ వేసి వదిలేశారు. బ్రిడ్జిపై నిర్మించిన పోల్స్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవైపు ఒంగిపోవడంతో ప్రజల ప్రయాణానికి రక్షణ లేకుండాపోయింది. ఈ వంతెన కింది భాగం చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో పేరుకుపోయి గొట్టాలు మూసుకుపోతున్నాయి. ఇక్కడ విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకొనడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది సర్వీస్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పించుకునే మార్గం లేక రక్షణ గోడ లేని ఈ బ్రిడ్జిపై బోల్తా కొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. అంతేకాక వానాకాలంలో చెరువులు నిండితే మదుములు తూము సరిగ్గా లేకపోవడంతో నీరంతా వంతెనపై ప్రవహిస్తుంటుంది. అటువంటి సమయాల్లో ఈ వంతెనపై బిక్కుబిక్కుమంటూ వాహనదారులు ప్రయాణం సాగించాల్సి వస్తుంది. కాగా బలహీనంగా ఉన్న ఈ వంతెన కుంగిపోయే అవకాశం ఉందని, అందువల్ల ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అరకు వెళ్లేందుకు దారి ఇదే..

విశాఖ నుంచి పర్యాటక ప్రాంతం అరకు వెళ్లాలంటే పెందుర్తి మీదుగా సరిపల్లి నుంచి ప్రయాణించాలి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెన పైనుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే విజయనగరం జిల్లాలో గల కొత్తవలస, ఎస్‌కోటలో గల స్టోన్ క్రషర్స్‌కు అనేక భారీ వాహనాలు దీని మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఎన్‌హెచ్ 16 ఆరు లేన్ల నిర్మాణానికి సంబంధించి సరిపల్లి ప్రాంతంలోనే కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీంతో మెటీరియల్‌కు సంబంధించిన లారీలు కూడా ఈ వంతెన పైనుంచే పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి.

వంతెన పైనుంచి ప్రయాణమంటేనే భయం



-పొట్నూరి అజయ్, సరిపల్లి

సరిపల్లిలోని వంతెన పైనుంచి ప్రయాణం భీతిగొల్పుతుంది. దశాబ్దాల కాలంగా ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఇది కుంగిపోయే స్థితికి చేరుకుంది. ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. అరకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం ఇదే కావడంతో వందల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.



షీలానగర్ సర్వీసు రోడ్డులో ఉన్న గొయ్యి

సర్వీసు రోడ్డులో ప్రమాదకరంగా గోతులు

రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై షీలానగర్ వద్ద ఉన్న గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. సుమారు రెండు నెలల క్రితం జాతీయ రహదారికి ఆనుకుని షీలానగర్ వద్దనున్న సర్వీస్ రోడ్డులో పైపు లైన్ లీకేజీ ఏర్పడడంతో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఇక్కడ మరమ్మతు పనులు చేశారు. పనులు పూర్తయ్యాక రోడ్డును తవ్విన సిబ్బంది మట్టితో పూడ్చారు. అయితే ఆ తర్వాత కురిసిన వర్షాలకు మట్టి పూడ్చిన చోట నీరు నిలవడం.. దానిపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించడంతో గోతులు పెద్దవయ్యాయి. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతుల దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం ఈ రహదారిలో జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులతో పాటు నాయకులు, ట్రాఫిక్ పోలీసులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఈ గోతులను పూడ్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరం. అధికారులు ఇకనైనా ఈ రహదారిలో వున్న గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

ఐసీడీఎస్ డైరెక్టర్ డాక్టర్ జయదేవి



బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలు జరిపినా, దానిని ప్రోత్సహించిన వారు కూడా నిందితులవుతారని సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) డైరెక్టర్ డాక్టర్ జయదేవి పేర్కొన్నారు. ఇక్కడి మరిడిమాంబ కల్యాణ మండపంలో కిశోర బాలికా వికాసం (కేబీబీ) ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట ప్రకారం 18 ఏళ్లలోపు యువతులకు, 21 సంవత్సరాలలోపు యువకులకు వివాహం చేయరాదని, అలా చేస్తే నేరమని పేర్కొన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా ఉంటుందని వివరించారు. చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ములగాడ ఎంఈవో త్రినాథరావు, ఐసీడీఎస్ ప్రతినిధులు రమణకుమార్, శ్రీలత, సూపర్‌వైజర్ వరలక్ష్మి, లలితకుమారి, ఏపీడీవో కృపానందరావు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తారు: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నా... సీఎం, డిప్యూటీ సీఎంలతో చర్చించి నిధులు రాబట్టి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు ఆధ్వర్యంలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తారన్నారు. వార్డుల్లో రూ.100 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శంకుస్థాపనలతో సరిపెట్టకుండా వంద రోజుల్లో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వుడా రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో సంఘ సభ్యులు వుడా కాలనీలో రోడ్లు, శ్మశానవాటిక నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందజేశారు. విరాట్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని సంఘ అధ్యక్షుడు పిల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని సమర్పించారు. అలాగే 97వ వార్డు పరిధిలోని సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్, వెంకటాద్రి నగర్, సప్తగిరినగర్, లక్ష్మీనగర్, హమ్మీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సేనాపతి శంకర్రావు, దాట్ల మధు, ఐతి సింహాచలం, సోమశేఖర్, జి.అప్పారావు, ఆర్‌ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం నిర్మాణానికి శంకుస్థాపన

పెదగంట్యాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరాలయ ముఖద్వారం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. శ్రీనగర్ శ్రీదుర్గాగణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి ఆలయ చైర్మన్ వెంకట సుబ్బరాజు, రామలక్ష్మి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో వేంకటేశ్వరాలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనను గాజువాక సీఐ పార్థసారథి ప్రారంభించారు.

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

అగనంపూడి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ఆలయంలో నెలగంట ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా రోజూ వేకువజాము నాలుగున్నర నుంచి శ్రీవారికి పూజలు జరుపుతామన్నారు. సంక్రాంతి వరకు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు.

సహకార ఉద్యమంలో రాజీలేని పోరు సాగించిన వ్యక్తి మానం ఆంజనేయులు



మానం ఆంజనేయులును సత్కరించిన సహకార బ్యాంకు ప్రతినిధులు

హైదరాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యమంలో దశాబ్దాల పాటు రాజీలేని పోరు సాగించిన యోధుడు మానం ఆంజనేయులు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ అండ్ క్రెడిట్ సొసైటీ ఫెడరేషన్ వ్యవస్థాపకులు అయిన ఆంజనేయుల అభినందన సభ శనివారం కూకట్‌పల్లిలోని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మానం ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్థిక అసమానతల నివారణకు సహకార వ్యవస్థే పరిష్కారం అన్నారు. ప్రభుత్వాల నుంచి ఏ రూపంలో ఆర్థిక సాయం పొందినా సహకార వ్యవస్థలు బతకవన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఆంజనేయులు పనిచేయడం సాధారణ విషయం కాదని, ఆయన అనుభవం వృథా కాదన్నారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి. రామారావు మాట్లాడుతూ ఏటీఎంలు వచ్చాక బ్యాంకులకు వచ్చే జనం తగ్గారని, కానీ విశాఖ సహకార బ్యాంకులో ఎప్పుడూ చూసినా మధ్య, దిగువ మధ్యతరగతి ప్రజలు కనిపిస్తారన్నారు. రూ.కోటితో ప్రారంభమైన బ్యాంకు లావాదేవీలను రూ.7675 కోట్లకు పెంచారని, ఎలాంటి మకిలి అంటకుండా 30 ఏళ్లు పనిచేశారని ఆంజనేయుల సేవలను కొనియాడారు. నాఫ్కాబ్ డైరెక్టర్ వేమిరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ సహకారోద్యమ భీష్ముడిగా అభివర్ణించారు. బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకారవ్యవస్థ పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంచారన్నారు.

శ్రీహరిపురంలో మూతపడిన దుకాణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మల్కాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించిన 14వ నంబర్ షాప్‌ను అధికారులు మౌఖిక ఆదేశాలతో మూయించారు. ఈ షాపును వేలం పాటలో దక్కించుకున్న వ్యక్తి సంబంధిత అధికారులు ఆదేశాలు ఇవ్వకుండానే దుకాణం తెరిచి వ్యాపారం మొదలుపెట్టేశారు. ఈ నేపథ్యంలో 'జీవీఎంసీ దుకాణాలకు రహస్యంగా వేలం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ తరుణంలోనే అనుమతులు లేకుండా తెరుచుకున్న దుకాణాన్ని మూయించారు.

కార్పొరేటర్ పర్యటన

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని హరిజన జగ్గయ్యపాలెం, వెంకటేశ్వరకాలనీల్లో శనివారం కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. కాలనీల్లోని కాలువలు, రహదారులతో పాటు హరిజన జగ్గయ్యపాలెం శ్మశాన వాటిక, సులబ్ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సులబ్ కాంప్లెక్స్, శ్మశాన వాటికలను ప్రజలే సంరక్షించుకోవాలని సూచించారు ఆయన వెనక కాలనీ నాయకులు వి.గోపి, జి.రామాంజనేయులు, ప్రవీణ్, పి.రవి, ఆనంద్, తదితరులు ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న జియోన్ చర్చి, జీసస్ క్రిస్ట్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా సంయుక్తంగా క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముఖ్యఅతిథిగా విశాఖ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళికి ప్రేమ, కరుణ, సేవ అనే విలువైన ప్రబోధాలు చేయటమే కాకుండా ఆచరించి చూపిన గొప్ప వ్యక్తి జీసస్ అని కొనియాడారు. అనంతరం చర్చి సభ్యులు శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లి, రమేష్, క్రిస్టియన్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 32, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 22, క్యారెట్ 56, దొండకాయలు 36, బంగాళదుంపలు 30, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది) 56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 24 దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ పిక్కలు 110, పొటల్స్ 52, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 34, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	103
ఫారం ధర	123
విత్ స్కిన్	216
స్కిన్‌లెస్	226

పెందుర్తిలో 12 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

సత్తివానిపాలెం రేవళ్ల చెరువు నీటి సంఘం కూడా..



సాగునీటి సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో పంచకర్ల



సత్తివానిపాలెం రేవళ్ల చెరువు నూతన కార్యవర్గ సభ్యులు

పెందుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలంలోని 13 సాగునీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికల్లో 12 సంఘాలు ఏకగ్రీవం కాగా పినగాడిలో ఎన్నిక నిర్వహించారు. తహసీల్దార్ ఎం.ఆనందకుమార్ సాగునీటి సంఘాల ఎన్నికలను పర్యవేక్షించారు. కూటమి మద్దతుదారులు అన్ని నీటి సంఘాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో పాత పెందుర్తి (టీడీపీ) నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శరగడం నర్సమ్మ, పెంటకోట కనకరాజు(టీడీపీ), లక్ష్మీపురం రాముడు చెరువు (జనసేన) నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సదరం భీమేశ్వరరావు, బొడ్డేటి పెంటయ్యనాయుడు, గుర్రమ్మపాలెం (టీడీపీ) సాగునీటి సంఘానికి గొలగాని దాలీడు, పొంతపల్లి అప్పారావు, గొరపల్లి (టీడీపీ), సరిపల్లి (జనసేన)కి గొర్లె రమేశ్, జామి వెంకటరమణ, సరిపల్లి (టీడీపీ)కి గొర్లె మల్లునాయడు, కోడిగుడ్ల రాము, ముదపాక(బీజేపీ)కు పిల్లా వెంకట సత్యనారాయణ, గొలగాని రాము, పినగాడి(టీడీపీ)కి కొరుపోలు సింహాద్రి అప్పడు, వెన్నెల సత్తిబాబు, గొరపల్లి(టీడీపీ)కి వట్టికెళ్ల నాగరాజు, పులిబంటి సీతారామ్, రాంపురం(జనసేన)కు నాలం నర్సింహమూర్తి, గేదెల పైడంనాయుడు, పినగాడి(టీడీపీ)కి చిరికి రాము, బయిలపూడి బండయ్య, సత్తివానిపాలెం(జనసేన)కు ముత్తా అర్జున్, పాండ్రంగి రమణ, నరవ (టీడీపీ)కు కర్రి గౌరీభూలోక, ఆళ్ల జగయ్యమ్మ, కోట నరవ (టీడీపీ)కు కంపర సూర్యరావు, రాపర్తి ఈశ్వరరావులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. జనసేన 6, టీడీపీ 6, బీజేపీ 1 సాగునీటి సంఘాలు కైవసం చేసుకున్నాయి.

పినగాడిలో ఎన్నిక

పినగాడి సాగునీటి సంఘం ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు యత్నించినా టీడీపీ మద్దతుదారులు రెండు వర్గాల మధ్య విభేదాల కారణంగా ఎన్నిక అనివార్యమైంది.

జగన్ ఆడలేక మద్దెల ఓడు: పంచకర్ల

పెందుర్తి నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నీటి సంఘాల నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సుజాత నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో సాగునీటి సంఘ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని వైసీపీ నేత జగన్ పోటీ పడలేక ఓడిపోతామని తెలిసి ఆడలేక మద్దెల ఓడు రీతిన అబద్ధపు ప్రకటన ఇచ్చారని ఆరోపించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, సాగునీటి సంఘ నూతన కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

రేవళ్ల చెరువు నీటి సంఘం కూడా..

గోపాలపట్నం: గ్రేటర్ 89వ వార్డు సత్తివానిపాలెంలోని రేవళ్ల చెరువు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పెందుర్తి మండల పరిధిలోని సత్తివానిపాలెంలోని రేవళ్ల చెరువు సాగునీటి సంఘం ఎన్నిక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. సత్తివానిపాలెం, గవర జగ్గయ్యపాలెం గ్రామాలకు చెందిన సాగునీటి వినియోగదారులు పాల్గొనగా, కూటమి పార్టీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నీటి సంఘం అధ్యక్షుడిగా ముత్త అర్జున్(జనసేన), ఉపాధ్యక్షుడిగా పాండ్రంకి రమణ (జనసేన), డైరెక్టర్లుగా పాండ్రంకి సత్యరాజు(టీడీపీ), నెక్కలి ఈశ్వరరావు(టీడీపీ), ఆళ్ల సూరిబాబు(టీడీపీ), ఆళ్ల అప్పలనాయుడు (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి ఎం.వెంకటరావు నూతన కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. రైతులు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

ఆదర్శ మైదానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

» ఆనందం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, ప్రజలు



మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం తవ్విన గోతులు

గాజువాక, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని ఆదర్శ మైదానంలో అభివృద్ధి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా ఆదరణకు నోచుకోక మైదానం రూపురేఖలే మారిపోతున్న తరుణంలో అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టడంతో క్రీడాకారులతో పాటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గాజువాక పట్టణ పరిధిలో సుమారు ఐదెకరాల స్థలంలో ఈ క్రీడా మైదానం ఉంది. అయితే ఈ మైదానంలో ఎటువంటి సదుపాయాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. కేవలం వాకింగ్ చేసుకునేందుకు, సరదాగా ఇక్కడ గడిపేందుకు మాత్రమే దీనిని వినియోగిస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు ఆదర్శ మైదానాన్ని అభివృద్ధి చేస్తామని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలు రూపొందించినా ఎటువంటి పనులకు నోచుకోలేదు. కాగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ మైదానం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం మైదానంలో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మైదానంలో పూర్తి స్థాయి అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. త్వరితగతిన ఈ మైదానాన్ని క్రీడాకారులకు అందుబాటులో తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.



పంచకర్లకు విద్యుత్ సమస్య గురించి వివరిస్తున్న విద్యార్థులు, తదితరులు

ఎమ్మెల్యే సారూ.. అంధకారంలో చదివేదెలా?

పెందుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సారూ! కరెంటు లేక చదువుకు ఆటంకం కలుగుతోంది. విద్యుత్ సౌకర్యం కల్పించండంటూ బర్మన్ కాలనీకి చెందిన పలువురు విద్యార్థులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును వేడుకున్నారు. శనివారం 97వ వార్డులో పర్యటించిన ఆయనను పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలిసి విద్యుత్ సమస్యపై ఏకరువు పెట్టారు. కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు ఎన్నికల సమయంలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఎమ్మెల్యే వారిని సముదాయిస్తూ రెండు రోజుల్లో మళ్లీ ఇక్కడకు వస్తానని, అప్పుడు దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పిస్తానని పంచకర్ల స్పష్టం చేయడంతో విద్యార్థులంతా ఆనందం వ్యక్తం చేశారు.

87వ వార్డులో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కూర్మన్నపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో కాలనీవాసులు శనివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ నాయకుడు జి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధానికి అందరూ కంకణం కట్టుకోవాలి-భావితరాల వారికి భవిష్యత్తునివ్వాలని, చేపలు, మాంసం మార్కెట్‌లకు స్టీలు గిన్నెలు, జ్యూట్, క్లాత్ బ్యాగులతో వెళ్లాలని సూచించారు. తమ కాలనీలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వాడితే జరిమానాను విధిస్తున్నామన్నారు. పలుచోట్ల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశామని, నీటి నిల్వలు లేకుండా చూస్తున్నామన్నారు. శీతాకాల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నాగభూషణం, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు దత్త జయంతి

అగనంపూడి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయిబాబా ఆలయంలో సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గురుదత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయంలో లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి, ప్రతినిధులు వ్యాసశర్మ, శంభుడు, రామారావు, నవీన్, రాజు, కిషోర్, సుబ్బారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



518 రకాల పిండివంటలతో సారె ఊరుగింపులో పాల్గొన్న భక్తులు

వైభవంగా గౌరీ పరమేశ్వరుల సారె సంబరం

కూర్మన్నపాలెం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో శనివారం కణితి గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల సారె సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. 518 రకాల పిండివంటలతో ఊరేగింపు చేపట్టారు. కణితి గవరవీధి, పద్మశాలివీధి, రాజులపాలెం, వడ్లపూడి, ఈ-సేవా సెంటర్, సిద్ధార్థ నగర్, అప్పికొండ కాలనీ, ముస్తఫా జంక్షన్‌ల మీదుగా భక్తి గీతాలు, కోలాటాల నడుమ ఊరేగింపు సాగింది. పూజల్లో పాల్గొన్న టీడీపీ జిల్లా నాయకుడు సూరిశెట్టి పెంటారావు మాట్లాడుతూ గౌరీపరమేశ్వరుల ఆశీసులతో ప్రజలంతా ఆనందంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు మళ్ల రాము, శ్రీను, భాస్కరరావు, పి.రమణ, ఎస్.కనక సత్యన్నారాయణ, శేషు, గౌరీ సేవా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్టీల్ సిటీ స్కూల్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ

అగనంపూడి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దువ్వాడలోని విజ్ఞాన్ స్టీల్ సిటీ పబ్లిక్ స్కూల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్రటేరియట్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)పై శనివారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌లు ఎంఎస్ సునీర్ నాగి, ప్రదీప్ సీబీఎస్ఈ గురించి విపులంగా ఉపాధ్యాయులకు వివరించారు. విద్యార్థులకు సులభంగా ఏ విధంగా బోధించాలో తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె.మాధురి, నమితా మాలిక్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై యాజమాన్యం వైఖరి మారాలి'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం వ్యవహరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. ప్లాంటులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం ఉత్పత్తికి అనుకూల పరిస్థితులు కల్పిస్తే కార్మికులు తమ అనుభవంతో అధిక ఉత్పత్తి సాధిస్తారనే విషయం ఇప్పుడు నిరూపితమైందన్నారు. అయితే కార్మిక వర్గాన్ని మాత్రం ఆర్థికంగా కుంగదీసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్రం కక్ష కట్టడం దారుణమన్నారు. జీతాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రగతికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు పట్టుగొమ్మలని, అటువంటి సంస్థలను నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్రను ఉద్యమాల తిప్పికొడతామని అయోధ్యరామ్ పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు యు.రామస్వామి, కేఎం శ్రీనివాస్. పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు. గంగాధర్, కృష్ణమూర్తి, రాజు, సత్యనారాయణ, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నైట్ ఫుడ్‌కోర్టు

ఆహార ప్రియులకు భలే రుచులు



- అందుబాటులో ఉత్తర, దక్షిణ భారతీయ వంటకాలు
- నోరూరించే వెయ్యికి పైగా ప్రత్యేక డిష్‌లు
- నైట్ ఫుడ్ కోర్ట్‌కు నగర వాసుల నుంచి విశేష ఆదరణ
- 120కి పైగా దుకాణాలు... వేలాది వెరైటీలు

(ఆంధ్రజ్యోతి-మద్దిలపాలెం)

ఘుమఘుమలాడే వంటకాలు... ఉత్తర, దక్షిణ భారతీయ ప్రత్యేకమైన వంటకాలను రుచి చూడాలంటే... నగరంలోని పాత జైలురోడ్డులోని నైట్ ఫుడ్ కోర్టుకు వెళ్లాల్సిందే. 120 స్టాళ్లు కలిగిన ఈ ఫుడ్ కోర్ట్‌లో సుమారు వెయ్యికి పైగా వెరైటీ డిష్‌లు ఆహార ప్రియులకు ఆహ్వానం పలుకుతుంటాయి. వెజ్, నాన్‌వెజ్ ఏ వంటకం కావాలన్నా అందుబాటులో ఉంటాయి. సాయంత్రమైతే చాలు ఆహార ప్రియులతో ఫుడ్‌కోర్ట్ నిండిపోతోంది. కేవలం యువతే కాకుండా కుటుంబ సమేతంగా ఇక్కడకు వచ్చి వాలిపోతున్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో అయితే విపరీతమైన రద్దీగా ఉంటుంది.





నైట్ ఫుడ్‌కోర్టులో వివిధ రకాల డిష్‌లు

ప్రస్తుతం నగరంలోని ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా బిల్లు తడిసి మోపెడవుతోంది. వాటితో పోల్చుకుంటే ఫుడ్‌కోర్ట్‌లో ధర తక్కువ, రూ.99 బిర్యానీ, రూ.60 నుంచే చికెన్ డిష్‌లు లభ్యమవుతున్నాయి. ఫలహారాలు కూడా సాధారణ ధరలకే అందుబాటులో ఉండడంతో ఆహార ప్రియులు క్యూ కడుతున్నారు.

వందకుపైగా చికెన్ డిషెస్

నాన్‌వెజ్ వంటకాలకు ఫిదా కాని వారెవ్వరు. వారి కోసం చికెన్‌లోనే వందకుపైగా డిష్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. 30 రకాల కబాబ్‌లు వండి వార్చే స్టాల్స్ దర్శనమిస్తాయి. చిల్లీ చికెన్, చికెన్ 65, చికెన్ డ్రాగన్, తందూరీ, చికెన్ వింగ్స్, చికెన్ లాలీపాప్స్, పకోడి, షవర్మా, చికెన్ బిర్యానీ, చికెన్ ఫ్రైడ్ రైస్ తదితర వంటకాలు ఫుడ్‌కోర్ట్‌లో నోరూరిస్తున్నాయి. వీటికి తోడు మటన్ బిర్యానీ, మటన్, రాగిసంగటి, చికెన్ రాగి సంగటి లాంటి వైవిధ్యమైన రుచులను ఆహారప్రియులు ఆస్వాదిస్తున్నారు.

నోరూరించే చేపల వంటకాలు

ఫిష్ తావా పేరిట కట్‌లైట్ ఫిష్, ఫిష్ తందూరి, ఫిష్ వేపుడు ఘుమఘుమలాడిస్తున్నాయి. వేడి వేడి చేపల పులుసు లొట్టలేయిస్తోంది. సంద్రంలో లభ్యమయ్యే అనేక రకాల చేపలు ఇక్కడ విభిన్న రుచులను ఆపాదించుకుని ఆహార ప్రియులను కట్టి పడేస్తున్నాయి.

ఉత్తరాది వంటకాలు ప్రత్యేకం

నగరంలో అనేక మంది ఉత్తరాది ప్రాంతాల వారు నివసిస్తున్నారు. వారిని ఆకట్టుకునే పానీపూరీ, పావుబాజీ, బొంబై చాట్‌తో పాటు 40 రకాల దోసెలు, చపాతీలు, పరోటాలు స్టాల్స్‌లో దొరుకుతున్నాయి. నార్త్ ఇండియా నుంచి వచ్చిన వారే వంటకాలు సిద్ధం చేసి నగర వాసులకు రుచులను చూపిస్తున్నారు. ఇడ్లీ, చిట్టి ఇడ్లీ, పూరీలు, గారెలు ఇలా అన్ని రకాల టిఫిన్లు రుచి చూసేందుకు ఫుడ్ లవర్స్ క్యూకడుతున్నారు. రంగుల గోలీ సోడాలు, కోలా, డ్రై ఫ్రూట్స్ లస్సీ, మాక్‌టైల్స్, టీ, తదితర పానీయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఫుడ్ అందుబాటులో ఉంటుంది.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతురాలు వేగి విజయలక్ష్మి (ఫైల్)

కొత్తూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. అనకాపల్లి మండలం పిసినికాడ జాతీయ రహదారి వద్ద సాయిబాబా గుడి సమీపంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన వేగి విజయలక్ష్మి(46) తన మేనల్లుడు మళ్ల గిరిబాబుతో కలిసి పువ్వులు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై అనకాపల్లికి బయలుదేరింది. పిసినికాడ వద్ద ఉన్న సాయిబాబా గుడి వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న లారీ తగిలి విజయలక్ష్మి, ఆమె మేనల్లుడు కిందపడిపోయారు. విజయలక్ష్మి పైనుంచి లారీ దూసుకుపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాగా స్వగ్రామాన్ని విడిచి కొన్నేళ్లుగా విశాఖపట్నం అక్కయ్యపాలెంలో నివాసముంటున్న ఆమె ఒక శుభ కార్యానికి వచ్చిన క్రమంలో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. ఈమెకు భర్త వేగి శ్రీను, కుమారుడు, కుమార్తె ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి మేనల్లుడు గిరిబాబు ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మురళీనగర్‌లో స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నేడు

మురళీనగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్పీడ్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో నిర్వహించనున్నట్లు పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. కమిటీ కార్యదర్శి సూర్యనారాయణ, సభ్యులు క్రీడాకారులకు సదుపాయాలు కల్పించారు. మురళీనగర్ వాసులతో పాటు నగర ప్రాంతాల నుంచి ఈ పోటీలు వీక్షించడానికి ఔత్సాహికులు విచ్చేస్తారని తెలిపారు.

40 గంటల పాటు వివిధ జిల్లాల న్యాయమూర్తులకు శిక్షణ

విశాఖపట్నం లీగల్, డిసెంబరు 14: కేసుల పరిష్కారానికి సంబంధించి న్యాయమూర్తులకు 40 గంటలపాటు శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలో కొత్తగానిర్మించిన భవనంలో ప్రారంభం కానున్నట్టు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ తెలిపారు. ఈ శిక్షణకు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 29 మంది జడ్జిలను హైకోర్టు నామినేట్ చేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కౌన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు శేషమ్మ వెల్లడించారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం





సింహాచలేశుని కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

సింహాచలం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు పురస్కరించుకుని ఈనెల 9వ తేదీ నుంచి నిలిపివేసిన ఆర్జిత సేవలను శనివారం నుంచి పునః ప్రారంభించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేశారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. శనివారం జరిగిన నిత్య కల్యాణోత్సవంలో గోపాలపట్నం ప్రాంతానికి చెందిన న్యాయవాది రాంజీ జన్మదినం సందర్భంగా తమ కుటుంబానికి చెందిన 50 జంటలకు దేవస్థానం నిర్ణయించిన రూ.1000 టికెట్లు తీయగా, వాళ్లతో పాటు నగరానికి చెందిన మరో 25 జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి.

లోక్ అదాలత్‌తో బాధితులకు సత్వర న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు

మహారాణిపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని, ఇలాంటి వేదికలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జిల్లా కోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ఉచిత న్యాయసహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిత్యం పనిచేస్తుందన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలన్నదే న్యాయ వ్యవస్థ అంతిమ లక్ష్యమని, ఆ దిశగా న్యాయమూర్తులు సేవలందిస్తున్నారని తెలిపారు. లోక్ అదాలత్ వంటి వేదికలలో పౌర శిక్షాస్మృతి, నేర శిక్షాస్మృతి పరిధిలో రాజీ కాగలిగిన కేసులు, వాహన ప్రమాదాల కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ప్రభుత్వ సంస్థలు, బీమా కంపెనీలు, కక్షిదారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, లోక్ అదాలత్ చైర్మన్ వల్లభ నాయుడు, జడ్జి కె.రాధారత్నం, డి.నరేష్ కుమార్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

చోరీ అయిన మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత



మొబైల్ ఫోన్లను హక్కుదారులకు అందజేస్తున్న రైల్వే పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్, రైళ్లలో అపహరించిన లేదా పోగొట్టుకున్న 61 మొబైల్ ఫోన్లను విశాఖపట్నం ప్రభుత్వ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.10 లక్షల విలువైన వీటిని హక్కుదారులకు అందజేశారు. మొబైల్ రికవరీ కార్యక్రమంలో భాగంగా విజయవాడ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీసు సీహెచ్ ధనంజయనాయుడు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆల్‌రౌండర్ ఆటతీరుతో ఆకట్టుకున్న యువ క్రికెటర్ యశ్వంత్



విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన యువ క్రికెటర్ బత్తిన యశ్వంత్ ఆల్‌రౌండర్ ఆటతీరుతో ఆకట్టుకుని ప్రతిష్ఠాత్మక కూచ్ బెహార్ ట్రోఫీ టోర్నీలో ఆంధ్ర జట్టు నాకౌట్‌కు చేరడంలో కీలకంగా నిలిచాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి, ఫీల్డింగ్‌లో చురుగ్గా కదిలి ప్రత్యర్థి బ్యాటర్ పరుగులు చేయకుండా కట్టడి చేసి రనౌట్స్‌లో భాగం పంచుకున్నాడు. ఈ ట్రోఫీలో హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో నాలుగు వికెట్లు, రెండో మ్యాచ్‌లో విదర్భపై రెండు వికెట్లు పడగొట్టి బౌలింగ్ సత్తా చాటాడు. ఉత్తరప్రదేశ్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో యశ్వంత్ అమోఘమైన ఆల్‌రౌండర్ ప్రతిభను ప్రదర్శించి మ్యాచ్‌ను డ్రాగా మలచడంలో కీలక పాత్ర వహించాడు. ఈ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 339 పరుగులు చేసి డిక్లేర్ చేయగా యశ్వంత్ మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా కేవలం వంద పరుగులకు ఆలౌటై డీలా పడింది. రెండో ఇన్నింగ్స్ ఉత్తరప్రదేశ్ 232 పరుగులతో డిక్లేర్ చేసి ఆంధ్ర ముందు 661 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. దీంతో ఆంధ్ర ఓటమి ఖాయమనుకున్న దశలో బ్యాటింగ్‌కు దిగిన యశ్వంత్ క్రీజులో ఆత్మవిశ్వాసంతో నిలబడి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 82 నాటౌట్ పరుగులతో జట్టును ఓటమి నుంచి కాపాడి డ్రాగా మలిచాడు. మధ్యప్రదేశ్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మధ్యప్రదేశ్ తొలి బ్యాటింగ్‌ను దెబ్బతీసి ఆంధ్ర జట్టుకు నాలుగు వికెట్ల తేడాతో విజయాన్నందించి నాకౌట్ దశకు చేర్చాడు. ఇటీవల కాలంలో విశాఖ నుంచి కె.ఎస్.భరత్, నితీష్‌కుమార్‌రెడ్డి టీమిండియా జట్టులో స్థానం పొంది గర్వంగా నిలిచారు. నితీష్‌కుమార్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ ఆస్ట్రేలియా పిచ్‌పై సత్తా చాటుతున్న నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక కూచ్ బెహార్ ట్రోఫీలో నగరానికి చెందిన మరో యువ క్రికెటర్ బత్తిన యశ్వంత్ అద్భుతమైన ఆల్‌రౌండర్ ప్రతిభతో రాణిస్తూ నితీష్‌మార్ రెడ్డికి జోడీగా భవిష్యత్తు టీమిండియా జట్టు తలుపు తట్టేందుకు సిద్ధమవుతున్నాడని నిపుణులు కొనియాడుతున్నారు.

17, 18 తేదీల్లో జిల్లాలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ పర్యటన

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణను పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడానికి ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విశాఖ జిల్లాలో పర్యటించనుంది. కమిషన్ సభ్యులు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారు. ఆయన నేతృత్వంలో జిల్లా యంత్రాంగం, వివిధ ఉప కులాల సభ్యులు, ఆయా కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థలు, సంఘాలతో సమావేశమై వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ పరిశీలించే అంశాల్లో... రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థల్లో షెడ్యూల్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యం అంశాలను పరిశీలించనున్నారు. షెడ్యూల్ కులాలలోని వివిధ ఉపవర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ఉన్న వెనుకబాటును కమిటీ పరిశీలిస్తుంది. ఈ కమిషన్‌కు సమస్యలు, సూచనలను అందించేవారు ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వినతిపత్రాలను అందించవచ్చని సంయుక్త సంచాలకులు పేర్కొన్నారు.

శ్రావ్యంగా ఘంటసాల గానోత్సవం



ఘంటసాల చిత్రపటం వద్ద గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంగీతం ఉన్నంతవరకు అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిస్తూనే ఉంటారని పలువురు కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల గానోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డాక్టర్ కేఎంకే రమేష్, ఘంటసాల అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, కళా సేవకులు కొణతాల రాజు హాజరై ఘంటసాల చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగానికి దొరికిన గొప్ప వరం ఘంటసాల అన్నారు. తదుపరి గానోత్సవంలో విశ్వప్రసాద్, కోమలి, రామ్ నరసింహం, సీవీ రాజేశ్వరి ఆలపించిన 'నాలోని.. రాగమీవే... కోవెల.. ఎరుగని... ఒకసారి కలలోకి రావయ్యా' గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై సోమేష్, తబలాపై చక్రపాణి, అప్పలరాజు, పాడ్స్ బాబ్జీ, కంగోపై పైడిరాజు చక్కని సంగీతాన్ని అందించారు.